

# ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తం

**తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**


2వ పేజీలో..

నల్గొండప్రతినిధి, ప్రభాతవార్త, జూలై 13
ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షపాతం లేకపోవడంతో తాగునీటి


నల్లగొండ వార్త

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి

మంగళవారం 14, జులై 2026 16 పేజీలు

# జలాశయాల్లో .. అడుగంటుతున్న నీరు



- యాదాద్రి జిల్లాలో దాహం..! దాహం
- సగానికే పరిమితమైన తాగునీటి సరఫరా
- 88.76 ఎంఎల్‌డీ అవసరానికి 51.19 ఎంఎల్‌డీ మాత్రమే పంపిణీ
- రోజు విడిచి రోజు మిషన్ భగీరథ నీరు..
- ట్యాంకర్లే దిక్కుఅండిపోతున్న బోర్లు...
- 33 గ్రామాల్లో అద్దె బోర్లతోనే సరఫరా
- హెచ్ఎండబ్ల్యూఎస్ పరిధిలో తీవ్ర సంక్షోభం...
- రిజర్వ్ ఫారెస్ట్ అనుమతు రాక నిలిచిన పైప్‌లైన్ పనులు
- వచ్చే వేసవిపై ఇప్పుడే ఆందోళన...
- రూ.210 కోట్ల ప్రాజెక్టు పూర్తి కాకపోతే మరింత కష్టమే

**యాదాద్రి భువనగిరి బ్యూరో, ప్రభాతవార్త :** వర్షాకాలం ప్రారంభమై రోజులు గడుస్తున్నా... యాదాద్రి భువనగిరి జిల్లాలో తాగునీటి పరిస్థితి మాత్రం రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతోంది. సాధారణంగా ఈ సమయంలో జలాశయాలు నిండిపోవాల్సి ఉండగా, ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేకపోవడం, ప్రధాన వనరుల్లో నీటిమట్టం తగ్గిపోవడం, పంపింగ్ సామర్థ్యం క్షీణించడం వల్ల జిల్లాలో మంచినీటి సంక్షోభం మెల్లగా ముదురుతోంది. ప్రభుత్వం ప్రతి ఇంటికీ నిరంతర తాగునీరు అందిస్తున్నామని ప్రకటిస్తున్న వేళ, అధికారిక గణాంకాలే జిల్లాలో నీటి కొరత తీవ్రతను బయటపెడుతున్నాయి.


2 లో..

# ఎల్‌నినో .. ఎఫెక్ట్

**మొహం చాటేసిన వర్షాలు**

**ప్రభాతవార్త, నడిగూడెం :** ఎల్ నినో ఎఫెక్ట్ తో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. వరుణ దేవుడు కరుణించడం లేదు. వర్షాలు మొహం చాటేసాయి. అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. మృగశిర, ఆరుద్ర కార్తె లు ముగిశాయి. పునర్వసు కార్తె కొనసాగుతుంది. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పోవడంతో అన్నదాత ఆశలు నీరు గారుతున్నాయి. వానాకాలం వరి సాగు ముందుకు సాగుతుందా అనే సందేహం కలుగుతుంది. రైతన్న ఆశలు చెదిరిపోతున్నాయి. రాష్ట్రంలో 20 జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది.

2 లో..






## ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించడమే

# ప్రతి పోలీసు అధికారి లక్ష్యం

- యాదాద్రి జోన్‌జు డీఐజీ డి.జోయెల్ డేవిస్
- శాంతిభద్రతల విషయంలో రాజీ లేదు - నేర నియంత్రణకు ముందస్తు చర్యలే విజయానికి మూలం
- ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి శాస్త్రీయ ఆధారాలతో విచారణ చేపట్టాలి
- నల్లగొండ జిల్లా పోలీసు శాఖ పనితీరు ప్రశంసనీయం - ఇదే అంకితభావంతో సేవలు కొనసాగించాలి

నల్గొండ ప్రతినిధి, ప్రభాతవార్త. జూలై 13
యాదాద్రి జోన్‌జు డి.ఐ.జి, డి.జోయెల్ డేవిస్ సోమవారం నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా పోలీసు కార్యాల యాన్ని సందర్శించి జిల్లా పోలీసు అధికారులతో సమగ్ర నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్, జిల్లాలోని బౌగోళిక పరిస్థితులు, శాంతిభద్రతల పరిస్థితి, నేరాల ధోరణి, పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, బందోబస్తు నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాల నివారణ,

## జలాశయాల్లో అడుగంటుతున్న నీరు..

మొదటి పేజీ తరువాయి..

జిల్లాలోని 717 ఆవాస గ్రామాలు, ఆరు మున్సిపాలిటీలకు ప్రతిరోజూ 88.76 మిలియన్ లీటర్ల (ఎంఎల్‌డీ) తాగునీరు అవసరం ఉండగా, ప్రస్తుతం 51.19 ఎంఎల్‌డీ మాత్రమే సరఫరా జరుగుతోంది. అంటే మొత్తం అవసరంలో కేవలం 57.67 శాతం మాత్రమే అందుతుండగా, 37.57 ఎంఎల్‌డీ లోటు కొనసాగుతోంది. ఇటీవల మరో 50 లక్షల లీటర్ల నీటి సరఫరా తగ్గిపోవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చింది. దీంతో అనేక గ్రామాల్లో రోజువారీ సరఫరా నిలిపివేసి రోజు విడిచి రోజు మిషన్ భగీరథ నీటిని విడుదల చేస్తున్నారు. జిల్లాలో అత్యధిక ప్రాంతాలకు నీటిని అందిస్తున్న హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్‌ఎండబ్ల్యూఎస్) పరిధిలో పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. ఈ పరిధిలోని 516 గ్రామాలు, పట్టణాలకు రోజుకు 64.54 ఎంఎల్‌డీ అవసరం ఉండగా కేవలం 29.98 ఎంఎల్‌డీ మాత్రమే సరఫరా అవుతోంది. అంటే సగానికి పైగా నీరు అందడం లేదు. ముఖ్యంగా ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లోని గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. జిల్లా కేంద్రం భువనగిరిలోనూ పరిస్థితి అంతే తీవ్రంగా ఉంది. అనేక కాలనీల్లో మూడు, నాలుగు రోజులకోసారి మాత్రమే కుళాయిలకు నీరు వస్తుండటంతో కుటుంబాలు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లపై ఆధారపడుతున్నాయి. ఒక్కో ట్యాంకర్‌కు వేల రూపాయలు చెల్లించాల్సి రావడంతో సామాన్య కుటుంబాలపై అదనపు భారం పడుతోంది. వాటర్ ప్లాంట్ల వద్ద కూడా డిమాండ్ పెరిగి, నీటి కోసం క్యూలు కనిపిస్తున్నాయి. భూగర్భ జలాల పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉంది. జిల్లాలో ఇప్పటికే వందలాది బోర్లు నీటిని కోల్పోతుండగా, అనేక గ్రామాల్లో చేతి పంపులు కూడా పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. ప్రస్తుతం 33 గ్రామాల్లో అద్దె బోర్ల ద్వారా, 351 చేతిపంపులు, 35 ఓపెన్ వెల్ల ద్వారా ప్రత్యామ్నాయంగా తాగునీరు అందిస్తున్నారు. అయినప్పటికీ అనేక గ్రామాల్లో అవసరానికి సరిపడా నీరు అందడం లేదు. పరిస్థితి మరింత విషమించకుండా ఉండేందుకు పలువురు సర్పంచ్‌లు గ్రామపంచాయతీ నిధులతో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామపంచాయతీలపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. జిల్లాలోని వివిధ నీటి సరఫరా వ్యవస్థల పనితీరు కూడా అసమానంగా ఉంది. ఆలేరు ప్రాంతంలో 1.72 ఎంఎల్‌డీ అవసరానికి 1.53 ఎంఎల్‌డీ సరఫరా చేస్తుండగా, వైటీడీఏ పరిధిలో 1.00 ఎంఎల్‌డీ అవసరానికి కేవలం 0.75 ఎంఎల్‌డీ మాత్రమే అందుతోంది. ఏకేబీఆర్ రిజర్వాయర్ పరిధిలో 14 ఎంఎల్‌డీ అవసరానికి 11.26 ఎంఎల్‌డీ సరఫరా జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాలకు అవసరమైన నీటిలో గణనీయమైన లోటు కొనసాగుతోంది. మరోవైపు ఉదయసముద్రం ఆగ్మెంటేషన్ పథకం పరిధిలో మాత్రం దాదాపు పూర్తి స్థాయిలో నీటి సరఫరా కొనసాగుతుండటం కొంత ఊరటనిస్తోంది. జిల్లాలో దీర్ఘకాలిక తాగునీటి సమస్యకు పరిష్కారంగా ప్రభుత్వం మల్లన్నసాగర్ నుంచి నీటిని తరలించే రూ.210 కోట్ల ప్రాజెక్టు చేపట్టింది. యాదగిరిగుట్ట వరకు పనులు వేగంగా సాగినప్పటికీ, సిద్దిపేట జిల్లా సరిహద్దులోని లాల్‌గడ్-మలన్‌పేట రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో సుమారు రెండు కిలోమీటర్ల పైప్‌లైన్ తవ్వకాల పనులు నిలిచిపోయాయి. ఈ ఒక్క అడ్డంకి కారణంగా మొత్తం ప్రాజెక్టు పూర్తిలో జాప్యం ఏర్పడుతోంది. అధికారులు పలుమార్లు అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపినా ఇంకా స్పష్టత రాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. నీటి సరఫరా తగ్గిపోవడంతో అనేక గ్రామాల్లో ప్రజలు మళ్లీ బోర్లు, ప్రైవేట్ వాటర్ ప్లాంట్లు, ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో మహిళలు ఉదయం నుంచే నీటి కోసం పాత్రలతో కుళాయిల వద్ద వేచి ఉండాల్సి వస్తుండగా, మరికొన్ని చోట్ల ఒకే రోజు వచ్చిన నీటిని రెండు రోజులకు సరిపడా నిల్వ చేసుకోవాల్సి వస్తోంది. గ్రామాల్లో నీటి పంపిణీ సమయాలపై తరచూ వివాదాలు కూడా తలెత్తుతున్నట్లు సమాచారం. వర్షాకాలంలోనే పరిస్థితి ఇంత తీవ్రంగా ఉంటే, రాబోయే వేసవిలో జిల్లా తీవ్ర తాగునీటి సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని నీటి వనరుల నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటి నుంచే జలాశయాల నిర్వహణ, పంపింగ్ స్టేషన్ల సామర్థ్య పెంపు, లీకేజీల నివారణ, కొత్త బోర్ల ఏర్పాటు, ప్రత్యామ్నాయ వనరుల అభివృద్ధి, మల్లన్నసాగర్ ప్రాజెక్టు పనుల వేగవంతం వంటి చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా, మిషన్ భగీరథ ఇంట్రా జిల్లా కార్యనిర్వహణ అధికారి కరుణాకర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైన చోట్ల ప్రత్యామ్నాయ బోర్లు, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. అయితే క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న నీటి కొరతను చూస్తుంటే, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం కోసం పెండింగ్ ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తిచేయాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.

## ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించడమే ప్రతి పోలీసు అధికారి లక్ష్యం

మొదటి పేజీ తరువాయి..

మాదకద్రవ్యాల నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్, ప్రజలకు అందిస్తున్న సేవలు, పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై సమగ్ర ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా డీజీ డి. జోయెల్ డేవిస్, మాట్లాడుతూ, నల్లగొండ జిల్లా పోలీసు శాఖ పనితీరు అత్యుత్తమంగా ఉందని అభినందించారు. ఇదే క్రమశిక్షణ, అంకితభావం, ప్రజాసేవా దృక్పథంతో ప్రతి అధికారి విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన, వేగవంతమైన పోలీసు సేవలు అందించడం ప్రతి పోలీసు అధికారి ప్రధాన లక్ష్యంగా ఉండాలని, ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే విధంగా వ్యవహరించాలని అన్నారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేస్తూ, ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణే పోలీసు శాఖ అత్యున్నత బాధ్యత అని పేర్కొన్నారు. నేరాలు జరిగిన తరువాత స్పందించడం కంటే అవి జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే సమర్థవంతమైన పోలీసింగ్ అని చెప్పారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలకు దారితీసే పరిస్థితులను ముందుగానే గుర్తించి, సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో విలేజ్ పోలీస్ వ్యవస్థ ద్వారా ప్రజలతో నిరంతరం మమేకమై స్థానిక సమస్యలు, వివాదాలు, అనుమానాస్పద కదలికలపై ముందస్తు సమాచారం సేకరించి నేరాలను ప్రారంభ దశలోనే అరికట్టాలని ఆదేశించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. రౌడీషీటర్లు, బైండోవర్ వ్యక్తులు, పాత నేరస్తులు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులు, అసాంఘిక శక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని, నైట్ పెట్రోలింగ్, నాకాబందీలు, కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు, వాహన తనిఖీలు మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. సున్నిత ప్రాంతాల్లో ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నల్లగొండ జిల్లా అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఇతర నేర కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇంటెలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేస్తూ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ అత్యంత కీలకమని పేర్కొంటూ, శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలు, ఫోరెన్సిక్ సాక్ష్యాలు, డిజిటల్ ఎవిడెన్స్‌ను సమర్థవంతంగా వినియోగించి దర్యాప్తు చేపట్టాలని సూచించారు. దర్యాప్తులో నాణ్యత పెరిగితేనే కోర్టుల్లో నిందితులకు శిక్షలు పడతాయని, ప్రతి దర్యాప్తు అధికారి చట్టపరమైన అంశాలపై పూర్తి అవగాహనతో విచారణ నిర్వహించాలని తెలిపారు. ప్రస్తుతం వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ చెల్లింపుల భద్రత, సోషల్ మీడియా నేరాలపై గ్రామాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా ట్రాఫిక్ అవగాహన, రోడ్డు భద్రత, మహిళల భద్రత అంశాలపై నిరంతర ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనల అమలులో ఎలాంటి రాజీ పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ఎస్‌హెచ్‌ఓ ఒక సమర్థవంతమైన నాయకుడిగా తన పోలీస్ స్టేషన్‌కు దిశానిర్దేశం చేస్తూ, సిబ్బందిని సమన్వయం చేసుకొని నేర నియంత్రణలో తనదైన ముద్ర వేయాలని డీజీ సూచించారు. పారదర్శకత, జవాబుదారీతనం, క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ, భవిష్యత్ పోలీసింగ్ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్పీ జిల్లా డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్‌ఓలతో సమావేశమై వారి పోలీస్ స్టేషన్ల పరిధిలోని నేరాల పరిస్థితి, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, శాంతిభద్రతల నిర్వహణ, కమ్యూనిటీ పోలీసింగ్, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, ఎస్‌బీ డీఎస్పీ మల్లారెడ్డి, నల్లగొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి, దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, డీటీసీ డీఎస్పీ నగేష్, సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ, ఏ.ఆర్ డిఎస్పీ శ్రీనివాసులు, జిల్లా సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్‌నినో ఎఫెక్ట్

మొదటి పేజీ తరువాయి..

20 జిల్లాల్లో సూర్యాపేట జిల్లా కూడా ఉంది. వ్యవసాయ శాఖ అధికారులు వానాకాలంలో పంటల సాగుకు సంబంధించి ప్రణాళికలను సిద్ధం చేసి ప్రకటించారు. కానీ వర్షా భావ పరిస్థితుల కారణంగా అంచనాలు తారుమారు అవుతున్నాయి. వ్యవసాయ శాఖ అధికారుల ప్రణాళికల ప్రకారం 50 శాతం మేరకు పంటల సాగు పడిపోయే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. వర్షాభావ పరిస్థితులపై ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ నివేదిక కూడా పంపింది. ఈ క్రమంలోనే గ్రామస్థాయి నుంచి వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు రైతు వేదికల్లో సదస్సులను నిర్వహించి ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచిస్తున్నారు. పలువురు రాష్ట్ర మంత్రులు కూడా ఇదే విషయాన్ని రైతులకు స్పష్టం చేస్తున్నారు. భూగర్భ నీటి మట్టం తగ్గిపోయింది. గత మూడు రోజులుగా ఎండలు పెరిగాయి. ఇదే పరిస్థితి కొనసాగితే మరింత ఎండలు పెరిగే అవకాశం లేకపోలేదు. దీంతో భూగర్భ నీటిమట్టం మరింత తగ్గి వానాకాలం వ్యవసాయ పనులు కొనసాగించాలన్న అన్నదాతకు భారంగా తయారైంది. తప్పని పరిస్థితుల్లో బోర్లు, వ్యవసాయ బావులను నిర్మిస్తున్నారు. ఒక్కొక్క రైతు సుమారు లక్ష రూపాయలు వరకు ఖర్చు చేసి బోర్లు, వ్యవసాయ బావులను నిర్మిస్తుండడంతో పెట్టుబడి మరింత పెరుగుతుంది. అయినా సరే వ్యవసాయమే జీవనాధారమైన అన్నదాత వెనకడుగు వేయకుండా పెట్టుబడులు పెరుగుతున్నప్పటికీ పంటల సాగుకు ముందుకు సాగుతున్నాడు. ఇప్పటికే బోర్లు, బావులు కింద నారుమళ్ళు పోశారు. వర్షాలు కురవకపోవడంతో నాట్లు వేస్తే పరిస్థితి ఏంటా అని అయోమయం చెందుతున్నారు. గత సంవత్సరం వానాకాలంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో తొమ్మిది లక్షలకు పైబిలుకు ఎకరాలలో వరి సాగు చేశారు. కానీ ఈసారి సగం ఎకరాలు తగ్గే పరిస్థితి కనిపిస్తుంది. బోర్లు, బావుల కింద తప్పితే సాగర్ ఎడమ కాలువ కింద వరి సాగు చేసే పరిస్థితి కనిపించడం లేదు. రాష్ట్రంలో పంటలు వేసేందుకు అనువైన సమయం ముగియ వచ్చింది. దీంతో ఆరుతడి పంటలు సాగు చేయనున్నారు. పప్పు, చిరుధాన్యాలు, నూనె గింజలు, వేరుశనగ, పెసలు, కందులు, సజ్జలు తదితర ఆరుతడి పంటలు సాగు చేయాలి. ఎల్ నినో ప్రభావంతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వము చర్యలు తీసుకుంటుంది. ఈ మేరకు అగ్రి, ఉద్యాన వర్సిటీలు, వాతావరణ శాఖ, జిల్లా కలెక్టర్ల సమన్వయంతో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే సమగ్ర ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికను వ్యవసాయ శాఖ సిద్ధం చేస్తుంది. జిల్లా, మండల స్థాయిలో ఎరువులు ఇతర వ్యవసాయ ఇన్పుట్లను తగినంతగా నిల్వచేసి క్షేత్రస్థాయిలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకునే పనిలో వ్యవసాయ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ఇది ఇలా ఉండగా ఇప్పటికే పోసిన నారుమళ్ళ ఎండిపోతున్నాయి. ప్రాజెక్టుల్లో కూడా ఆశించిన స్థాయిలో నీరు లేదు. వర్షాలు కురుస్తాయని ఆశలు కనిపించడం లేదు. రాష్ట్రంలోని 17 జిల్లాలలో భూగర్భ నీటి మట్టాలు భారీగా పడిపోయాయి. ప్రత్యామ్నాయ పంటలకు సంబంధించి ప్రభుత్వము మూడు దశల్లో కంటింజెన్సీ ప్రణాళికను సిద్ధం చేసింది. ప్రథమ దశ ప్రణాళిక ఈనెల 15 నుంచి అమలు చేయను న్నారు. వర్షపాతం పరిగణలోకి తీసుకొని జూలై 30 నుంచి ఆగస్టు 15 వరకు పరిస్థితులను అంచనా వేసి తదుపరి ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అమలు చేయనున్నారు. రైతులు రెండు పర్యాయాలు దుక్కులు దున్ని ఉంచారు. వర్షాలు కురిస్తే నాట్లు వేసే పనులు ప్రారంభించాలని ఆశిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కువ శాతం వరి సాగు చేస్తారు. ఆ తర్వాత పత్తి పంట సాగు చేస్తారు. రెండు మూడు రోజులుగా కాస్తున్న ఎండలను చూసి రైతులు బెంబేలెత్తుతున్నారు. వర్షాలు కురుస్తాయా అనే సందేహం వారి నుండి వ్యక్తం అవుతుంది. విత్తనాలు, ఎరువులు అన్ని సిద్ధం చేసి ఉంచుకున్నారు. ఎల్ నినో ప్రభావంతో దిక్కుతోచని స్థితిలో అన్నదాత కొట్టుమిట్టాడుతున్నారు.

## ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తం

మొదటి పేజీ తరువాయి..

సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వినతులు స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు ఉన్నందున జిల్లాలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, హాస్టళ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల స్థాయి అధికారులు ప్రతి రెండు వారాలకు ఒకసారి హాస్టళ్లు, పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాలను తప్పనిసరిగా తనిఖీ చేసి, వాటి నివేదికలను స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ సమర్పించాలని సూచించారు. పాఠశాల విద్యార్థుల యూనిఫాంను ఈ నెల 15వ లోగా రెసిడెన్షియల్ పాఠశాలల బాలికలకు పంపిణీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈ సోమవారం మొత్తం 105 దరఖాస్తులు రాగా, రెవెన్యూ శాఖ కు 55, తక్కిన శాఖలకు 50 వచ్చాయి. రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు ప్రజల వద్ద నుండి దరఖాస్తుల స్వీకరించారు.

# ట్రాన్స్ ఫార్మర్ లలో కాపర్ వైర్ చోరీ చేస్తున్న ముఠా అరెస్ట్

**- ఐదుగురు అరెస్టు, 5 సెల్ ఫోన్‌లు, అశోక్ లేలాండ్ ట్రాలీ, టు వీలర్ స్వాదీనం**

**- సిఐ చరమందరాజు**



హుజూర్ నగర్ క్రైమ్,జూలై 13 ,ప్రభాతవార్త :

వ్యవసాయ పొలాలు, కాలువల వద్ద ఉన్న ట్రాన్స్ ఫార్మర్ ల ను ధ్వంసం చేసి కాపర్ వైర్లు దొంగిలిస్తున్న అంతరాష్ట్ర ముఠాను నేరేడుచర్ల పోలీసులు అరెస్ట్ చేశారు. హుజూర్ నగర్ సర్కిల్ కార్యాలయంలో సి ఐ చరమందరాజు సోమవారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు.నేరేడుచర్ల ఎస్ ఐ చలమల్ల గోపాల్ రెడ్డి తన సిబ్బంది తో చిల్లేపల్లి గ్రామంలోని సోమారం క్రాస్ రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సోమారం వైపు నుండి అశోక్ లేలాండ్ ట్రాలీ వాహనం దానికి పైలెట్ గా నెంబర్ ప్లేట్ లేని సిడి డాన్ వెహికల్స్ వస్తున్నాయి. అనుమానాస్పదముగాఉండటంతో రెండు వాహనాలను ఆపి అందులో ఉన్న వారిని వివరాలు అడగగా తడబడుతూ పొంతన లేని సమాదానం చెప్పారు. దీంతో వారిని విచారించగా మహారాష్ట్ర స్టేట్ పరభాని జిల్లా లోహగాన్ గ్రామానికి చెందిన వారమని గత నెల 20 న రాత్రి సమయం లో నేరేడుచర్ల మండలం ఫతేపురం గ్రామం శివారు లోని మహాత్మా గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కు ఉపయోగిస్తున్న 2500 కెవి ఏ ట్రాన్స్ ఫార్మర్ ను పగలగొట్టి సుమారు 1250 కిలోల రాగి తీగను దొంగిలించి ఆ రాగి తీగను హైదరాబాద్ కి తరలించి ఖలీద్ స్క్రాప్ షాపు లో విక్రయించగా వచ్చిన రూ 50,000 లతో జల్సాలు చేసినట్లు నేరం అంగీకరించారు. అంతే కాకుండా వీరంతా కలిసి తెలంగాణ లోని నేరేడుచెర్ల, చింతలపాలెం, మునగాల, మట్టంపల్లి, మిర్యాలగూడ రూరల్, నిర్మల్ మండలం లోకేశ్వరం పోలీసు స్టేషన్ పరిదిలో నిర్మానుష్యంగా ఉన్న వ్యవసాయ భూముల్లో ట్రాన్స్ ఫార్మర్లను టార్గెట్ చేసి, వాటిని కిందకు దించి ట్రాన్స్ ఫార్మర్ ల లో కాపర్ వైరు ను చోరీ చేసి పుణె ,హైదరాబాద్ లలో విక్రయించి వచ్చిన డబ్బులతో జల్సాలు చేసినట్లు నేరం అంగీకరించటంతో రాజేందర్ బాబన్ బోలె, ధర్మాజి బాబన్ రావు బోలె, శివాజీ భాగ్వాన్ మోరే, రవి కృష్ణ భోలే ల తో పాటు హైదరాబాద్ లోని ముషీరాబాద్ బొలక్ పూర్ బిలాల్ మస్జిద్ ఏరియా లో నివసించే మహమ్మద్ ఆయాజ్ లను అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుస్తున్నట్లు సి ఐ చెప్పారు. వారి వద్దనుంచి 5 సెల్ ఫోన్ లు అశోక్ లేలాండ్ ట్రాలీ, టు వీలర్ స్వాదీనము చేసుకున్నామని, చోరీ సొత్తు ను కొనుగోలు చేసిన హైదరాబాద్ కి చెందిన ఖలీద్ పరారీలో ఉన్నాడు. అతన్ని త్వరలోనే అరెస్టు చేయనున్నట్లు సి ఐ చరమందరాజు చెప్పారు . వేసవి కాలంలో వ్యవసాయ క్షేత్రాల దగ్గర ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ లను రైతులు సేఫ్ ప్లేస్ కు తరలించికోవాలని సి ఐ సూచించారు . ఈ సమావేశంలో కానిస్టేబుల్స్ మురళి ,చంద్రిక, గోలి శంభయ్య, దుర్గం నాగరాజు తదితరులు పాల్గొన్నారు .

## వైభవంగా శివపార్వతుల కళ్యాణమహోత్సవం

మేళ్ళచెరువు జూలై 13 ప్రభాతవార్త:

స్థానిక శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీస్వయంభూశంభులింగేశ్వర స్వామివారి ఆలయములో సోమవారం మాస శివరాత్రి సంధర్భముగా శివజన్మనక్షత్రమైన ఆరుద్ర జన్మనక్షత్రము సంధర్భముగా శివపార్వతుల కళ్యాణమహోత్స వ కార్యక్రమాలు అంగరంగవైభవంగా జరిగాయి. తొలుత గణపతి స్వామి వారికి ప్రత్యేకపూజలు, పుణ్యాహావచనం, కంకణధారణ, శివపార్వతులకు వివిధరకాల పుష్పమాలలతో అలంకరణ, పట్టువస్త్రాల సమర్పణ, మాంగల్యధారణ, జిలకరబెల్లం, తలంబ్రాలు, మంగళహారతులు, వివిధ కళ్యాణపూజాకార్యక్రమాలు మేలతాళములతో, వేధమంత్రోచ్చరణలతో కన్నులపండుగగా జరిగాయి. ఈ సంధర్భముగా స్వయంభూ శివలింగమునకు మహాలింగార్చణ, బిల్వార్చనలు, ప్రత్యేక అభిషేకములు, కుంకుమార్చనలు, నందీశ్వరునికి అభిషేకములు, గోమాతకు ప్రత్యేకపూజలు, అన్నప్రసాద వితరణ, దైవనామస్మరణాభజనలు, గుడిసేవలు, పల్లకీసేవలు, గణంగా జరిగాయి. నేడు సోమవారం మరియు మాసశివరాత్రి మరియు శివదేవుని ఆరుద్ర జన్మనక్షత్రం ఈ మూడు కలసి ఒకేరోజు రావడం చాలా చాలా అరుదు అని ఇంత పవిత్రమైన మూడు కలసిన శుభసంధర్భముగా శివపార్వతులను దర్శించు కున్నవారంతా గొప్ప అదృష్టవంతులని వేదపండితులు అన్నారు. ప్రతిఒక్కరూ తమ తమ గ్రామాలకు, పట్టణాలకు అందుబాటులో ఉన్న శివాలయాలములకు వెళ్ళటం చాలా మంచిది అని తెలిపారు. నేడు అన్న ప్రసాద వితరణ దాతలు చిత్తలూరి నాగమణి కుటుంబసభ్యులను ఆశీర్వదించి సత్కరించారు. ఈ కార్యక్రమాలలో కార్యనిర్వహణాధికారి ఖినాగేళ్ళ శంభిరెడ్డి, కొంకపాక శివవిష్ణువర్ధనశర్మ,



శివధ నుంజయ శర్మ, సాయిామహేశ్ శర్మ, పెండ్లి లచ్చయ్య, బుస్సా రామారావు, వరగాని నాగరాజు, బారెడ్డి వెంకటరెడ్డి, కూన్రెడ్డి కొండారెడ్డి, లంకెల నర్సింహారెడ్డి, భారీసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## సైబర్ మోసాలపట్ల జాగ్రత్తగా ఉండాలి

మేళ్ళచెరువు జూలై 13 ప్రభాతవార్త:

స్థానిక కస్తూరీభా బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం పోలీస్ కళాబృంధంవారిచే సైబర్మోసాలు, మత్తు పధార్థములు, రోడ్డు ప్రమాదముల గురించి నిర్వహించిన అవగాహణ సదస్సులోయస్.ఐ. నవీన్ కుమార్ మాట్లాడుతూ సైబర్ మోసాలకు గురికాకుండా అన్ని జాగ్రత్తలను పాటించాలని,బ్యాంకు ఖాతాల నెంబర్లు, ఎ.టి.యం. ల వివరాలు, సెల్ ఓ.టి.పి. ల వివరాలు ఇతరులకు ఎవ్వరికితెలియకుండా జాగ్రత్తపడాలని మేస్సేజ్లలో వచ్చే బ్లూ లింకులు ఎవరూ అనుసరించవద్దని ఎక్కడైనావ్యక్తిగత వివరాలను నమోదు చేయవద్దని ప్రతినిత్యం సమాజంలో జరుగుచున్న అనేకమోసాలు, అనేసంఘటనల పట్ల చాలా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. సైబర్ మోసాలు జరిగితే వెంటనే 1903 టోల్ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేయాలని బాలకలను వేధింపులకు గురిచేసినా ఎలాంటి అసౌకర్యాలకుగురిచేసినా వెంటనే షీటీమ్ 8712686056 అను సెల్




నెంబర్కు వెంటనే సమాచారం ఇవ్వాలని అన్నారు.బాలికలంతా క్రమశిక్షణగా చదువుకోవాలని, తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని ఉన్నత స్థాయికిఎదగాలని కోరారు. ఈ కార్యక్రమాలలో కస్తూరీభా స్పెషల్ ఆఫీసర్ హరిత, పోలీసులు వీరాంజనేయులు,నితిన్రెడ్డి, కళాబృంధం సభ్యులు ఎల్లన్న, గోపయ్య, చారి, కృష్ణ, గురులింగం, నాగార్జునతో పాటుఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## గోపాలపల్లి నుండి ఔరవాణి బీటీ రోడ్డు తరగతిగా పూర్తి చేయాలి

**- మంత్రికి విన్నపం వినతిపత్రం....**

నార్కట్పల్లి ప్రభాతవార్త జూలై 13గోపాలాయపల్లి నుండి ఔరవాణి వయా ఎనుగులధోరి,కొండపాక గూడెం గ్రామాల పరిధిలో నిర్మించే బీటీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయలని తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డికి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీ శిగ విష్ణు గౌడ్ తో కలిసి వినతి పత్రం సమర్పించిన మండల కాంగ్రెస్ నాయకులు తిరుగుడు నాగేష్ యాదవ్. మంత్రిగారు వెంటనే స్పందించి కొండపాక గూడెం గ్రామం నాకు స్వంత గ్రామం తో సమానం అని త్వరగా బిటి రోడ్డు పూర్తి చేయాలని లేనియెడల కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగింది.

## నేరాలు-దారుణాలు

## సర్ ప్రక్రియను సమన్వయంతో వేగవంతం చేయాలి: తహసీల్దార్ విజయలక్ష్మి

చింతపల్లి, జూలై 13 ప్రభాతవార్త:



సర్ ప్రక్రియను అధికారులు పరస్పర సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని చింతపల్లి తహసీల్దార్ విజయలక్ష్మి ్మ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్యూమరేషన్ పత్రాల స్వీకరణ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు స్వీకరించారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని, ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సర్ ప్రక్రియ పూర్తి కావడానికి గడువు రోజురోజుకూ తగ్గిపోతున్నందున అధికారులు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా, ఎవరూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు దూరం కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అవసరమైన పత్రాలను సకాలంలో సమర్పించి సర్ ప్రక్రియను విజయవంతం చేయడంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా అధికారులు, రాజకీయ పార్టీలు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఇప్పటికీ ఎన్యూమరేషన్ ఫారం అందని వారు సంబంధిత బీఎల్ఓలను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, ఆర్ఐ సునీత, కార్యదర్శి అశోక్, స్థానిక సర్పంచ్ కాసారపు శ్వేతా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ కమ్యూనిస్టు ఉద్యమానికి నారాయణరావు సేవలు చిరస్మరణీయం

**- సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి**

దేవరకొండ, జూలై 13 (ప్రభాతవార్త):

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, దేవరకొండ ప్రాంత కమ్యూనిస్టు ఉద్యమానికి విశిష్ట సేవలందించిన కామ్రేడ్ ఉజ్జేని నారాయణరావు సేవలు చిరస్మరణీయమని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు.ఉజ్జేని నారాయణరావు 10వ వర్ధంతి సభ ఆదివారం మండల కేంద్రంలోని సాయి సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు.. ఈ సభకు కమ్యూనిస్టు పార్టీ నాయకులు, ఉద్యమకారులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరైనారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నారాయణరావు తెలంగాణ సాయుధ పోరాటంలో చురుకుగా పాల్గొని రైతులు, కూలీలు, పేద ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాటం చేశారని పేర్కొన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలను ఆచరిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని కొనియాడారు.దేవరకొండ ప్రాంతంలో పార్టీ నిర్మాణం, రైతు-కూలీ ఉద్యమాల బలోపేతం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సేవలు నేటి తరానికి ఆదర్శమని అన్నారు. నారాయణరావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఉజ్జేని నారాయణరావు జీవిత విశేషాలు, కమ్యూనిస్టు ఉద్యమానికి ఆయన చేసిన సేవలను స్మరించుకునే ఈ వర్ధంతి సభకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినందుకు ప్రతిఒక్కరికి పల్లా వెంకట్ రెడ్డి ధన్యవాదములు తెలియచేశారు .



## నులి పురుగుల నివారణ మందులు పంపిణీ

**నడిగూడెం, జూలై 13, ప్రభాతవార్త:**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గ్రామ సర్పంచ్ కేసగాని సరితలక్ష్మణ్ స్థానిక జెడ్ పి పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ఒకటి నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, యువతకు ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. పిల్లలు అపరిశుభ్రంగా ఉండడం, చేతులు శుభ్రంగా కడుక్కోకపోవడం వల్ల నులిపురుగులు పుట్టుకొస్తాయని తెలిపారు. విద్యార్థులు పరిశుభ్రంగా ఉండాలన్నారు. శుద్ధి చేసిన నీరు త్రాగడం, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. పిల్లలను నులిపురుగుల బారి నుంచి కాపాడి వారి ఆరోగ్యం, పోషకాహారం ఎదుగుదలకు తోడ్పడే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రణబోతు మల్లారెడ్డి, ఉప సర్పంచ్ కోట చంద్రశేఖర్ రెడ్డి, ఇన్చార్జి హెచ్ ఎం కరుణ లత, ఎఎన్ఎం రమాదేవి, ఆశావర్కర్ జ్యోతి, సీనియర్ నాయకులు నిండు చర్ల వెంకటేశ్వర్లు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.






## రక్తహీనతను నివారించవచ్చు

**నడిగూడెం, జూలై 13, ప్రభాతవార్త:**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం త్రిపురవరం పరిధిలోని అన్ని పాఠశాలలు , అంగన్వాడీ కేంద్రాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 1 నుండి నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు (ఆల్బెండాజోల్) అందజేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది తెలిపారు. నడిగూడెం పల్లె దావకాన డాక్టర్ హరినాథ్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. ఆల్బెండాజోల్ మాత్రలను తీసుకోవడం వల్ల నులిపురుగుల నివారణతో పాటు రక్తహీనతను కూడా నివారించవచ్చని తెలిపారు. పిల్లలందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆటలు ఆడిన తర్వాత లేదా బయట నుంచి ఇంటికి వచ్చిన వెంటనే చేతులు, కాళ్లు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. ఆరుబయట మలమూత్ర విసర్జన చేయకుండా, మరుగుదొడ్లను వినియోగించడం ద్వారా నులిపురుగుల వ్యాధులను నివారించవచ్చని ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## బతకమ్మ ఘాట్ నిర్మాణ పనులు

**నడిగూడెం, జూలై 13, ప్రభాతవార్త:**

మండలంలోని చెన్నకేశవాపురం గ్రామంలో బతుకమ్మ ఘాట్ నిర్మాణ పనులను సోమవారం గ్రామ సర్పంచ్ గోసుల రాజేష్ ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ వేడుకల సమయంలో గ్రామస్తులు చెరువు వద్ద బతుకమ్మ ఉత్సవాలు జరుపుకోవడానికి ఇబ్బందులకు గురవుతున్నారని భావించి బతుకమ్మ ఘాట్ ను ఏర్పాటు చేయటం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి. సురేష్, ఉప సర్పంచ్ కటికల పుల్లయ్య, వార్డు సభ్యులు పప్పుల ఉపేందర్, శివరాత్రి వీరబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## నులి పురుగు నివారణ మందులు వేసుకోవాలి

**మునగాల, జులై 13, ప్రభాతవార్త :**

నులి పురుగు నివారణ మందులు ఆల్బెండజోల్ వేసుకోవాలని ఉప సర్పంచ్ కాసర్ల వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో నులిపురుగు నివారణ దినోత్సవం లో భాగంగా 1 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలకు నివారణ మాత్రలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో చదివి విద్యార్థులతో పాటు బడి బయట పిల్లలను కూడా గుర్తించి ప్రతి ఒక్కరికి అందించే విధంగా వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. నులి పురుగు నివారణతో రక్తహీనత లేకుండా పెరుగుదల లోపం కలగకుండా ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సరిత, ప్రత్యేక అధికారి సునీత, డాక్టర్ సుశాంక్, హెల్త్ అసిస్టెంట్ సురేష్ వైద్య సిబ్బంది పోలీస్ సిబ్బంది కావేరి, అప్పారావు పాల్గొన్నారు.



## కేజీబీవీని తనిఖీ చేసిన తాసిల్దార్

**నడిగూడెం, జూలై 13, ప్రభాతవార్త:**



స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం తహసిల్దార్ ఎల్. మంగ తనిఖీ చేశారు. విద్యాలయంలో సమస్యలు ఏమైనా ఉన్నాయా అని బాలికలను అడిగి తెలుసుకున్నారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న నేపథ్యంలో ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలకు కావలసిన సౌకర్యాలు తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం తదితర వివరాలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారా అనే విషయమై ఆరా తీశారు. యూనిఫామ్ తదితర మెటీరియల్ అందజేశారా అని బాలికలను అడిగారు. బాలికలతో కలిసి భోజనం చేశారు. సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మార్కెట్ డిమాండ్ ఉన్న వరి రకాలనే సాగు చేయాలి...

**- ఏడీఏ ప్రశాంతి**

**అనంతగిరి, జూలై 13 ప్రభాత వార్త:** మండలంలోని వాయిల సింగారం గ్రామంలో ఏడీఏ ప్రశాంతి వరి నారుమడులను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాలను మాత్రమే సాగు చేయాలని, నారుమడిలో కలుపు నివారణకు విత్తిన 15-20 రోజులకు బిస్పైరిబాక్ సోడియం పిచికారీ చేయాలని, నారు ఎదుగుదలను బట్టి నత్రజని ఎరువులు వాడాలని సూచించారు. నాట్లకు వారం రోజుల ముందు ఎకరానికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు వేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవో అందె సతీష్, ఏఈఓ అన్వేష్, సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరావు, రైతులు కొల్లు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



## సంతాపం తెలిపిన నాయకులు

**నడిగూడెం, జూలై 13, ప్రభాతవార్త:**

మండలంలోని వల్లాపురం గ్రామానికి చెందిన మాజీ జెడ్పిటిసి కిన్నెర నాగయ్య తల్లి కిన్నెర పిచ్చమ్మ మృతి పట్ల మండల కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు. పార్థివ దేహం పై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొక్క బిక్షపతి, కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపూరి తిరుపతమ్మ సుధీర్, సర్పంచులు సరిత లక్ష్మణ్ గౌడ్, దున్న శ్రీనివాస్, బూత్కూరు వెంకటరెడ్డి, దాట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు వల్లపు రెడ్డి సురేందర్ రెడ్డి, నాగిరెడ్డి వెంకటరెడ్డి, యుగంధర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సాయిబాబా, గుండు శ్రీనివాస్, పల్లా వెంకటరెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు.

## ఆలయంలో ఘనంగా అభిషేకాలు

**నడిగూడెం, జూలై 13, ప్రభాతవార్త:**



నడిగూడెం మండల కేంద్రంలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో వేంచేసి యున్న శ్రీ సారంగేశ్వర స్వామికి మాస శివరాత్రి పురస్కరించుకొని ఆరుద్ర నక్షత్రం సోమవారం రావటంతో శివయ్యకు తహసిల్దార్ మంగ, గ్రామ సర్పంచి దున్నా శ్రీనివాసులు ప్రత్యేక అభిషేకములతో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ పూజారి రాజశేఖర్ శర్మ అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు బాణాల నాగరాజు, గుండు విజయరామరావు, లాపూరి బాలాజీ, భవిరిశెట్టి సత్యనారాయణ, దున్నా ప్రవీణ్, చల్లా రత్నం, వందనపు దయాకర్, బోనగిరి ఉపేందర్, రామ్ రెడ్డి శివ, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అన్ని దానాల కల్లా అన్నదానం మిన్న

**మునగాల, జులై 13, ప్రభాతవార్త :**



అన్ని దానాల్లో కల్లా అన్నదానం మిన్న అని నరసింహపురం సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ అన్నారు. మునగాల మండల పరిధిలోని ముకుందాపురం లో ఇందిర అనాథ వృద్ధాశ్రమం లో నరసింహపురం గ్రామ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ. రమాదేవి దంపతుల కుమారుడు పార్థివ్ చౌదరి పుట్టిన రోజు సందర్భంగా ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలకు వృద్ధులకు మానసిక వికలాంగులకు అన్నదానం చేయడం మానసిక సంతృప్తి కలిగించిందన్నారు. గత కొంతకాలంగా తమ కుమారుడి పుట్టినరోజు, తమ దంపతుల పెళ్లిరోజు ఈ ఆశ్రమంలో క్రమం తప్పకుండా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆశ్రమం లో నిరాధారణ కు గురై ఉన్న వృద్ధులకు మానసిక వికలాంగులకు ప్రతి ఒక్కరూ సహకారం అందించి వృద్ధాశ్రమ లోని వృద్ధులకు ఒక్కరోజు భోజనం ఏర్పాటు చేయటం పుణ్యకార్యం గా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమం లో వార్డ్ సభ్యులు షేక్ అజీజ్ మియా, చెర్వుపల్లి. శ్రీనివాస్, బుద్ధి. నరేష్ , మల్లె బోయిన. రామక్రిష్ణ, ఆశ్రమ నిర్వాహకురాలు. నాగిరెడ్డి విజయమ్మ , తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ ఆఫ్ నిడమనూరు ఏకగ్రీవంగా ఎన్నిక

**నిడమనూరు ప్రభాత వార్త జులై 13**

మండల కేంద్రంలోతేదీ 130726 రోజు సోమవారం ఉదయం ప్రెస్ క్లబ్ ఆఫ్ నిడమనూరు మండల కమిటీ (గిగేజ్బాగిగే)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నిడమనూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా కున్ రెడ్డి బాలకోటిరెడ్డి(తొలి సాక్షి ) ప్రధాన కార్యదర్శిగా బత్తుల సూరయ్య నాయుడు (పంతులు )(వార్త ), ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఒక్కంటి అరుణ్ కుమార్( ఈనాడు) ఉపాధ్యక్షులుగా ఉమ్మడి వెంకట్ రెడ్డి ( సాక్ష్యం), కోశాధికారిగా జువ్వి రాజు ( మన తెలంగాణ), సహాయ కార్యదర్శిగా చీదళ్ల నరహరి( సాక్షి), కార్యవర్గ సభ్యులుగా మొగిలి రవి ( విశాల తెలంగాణ ) అన్నే బోయిన కొండల్ ( నేటి దర్శిని), కంచర్ల రవీందర్ రెడ్డి ( ధ సౌత్ ఇండియా టైమ్స్), బొజ్జ రవి ( క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ ),జె. సాయి ( ప్రజా జ్యోతి ) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ఏర్పాటుకు సహకరించిన మిత్రులకు




నూతన కార్యవర్గం సభ్యులకు

కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు బాలకోటిరెడ్డి ఖీ బత్తుల సూరయ్య నాయుడు(పంతులు )మాట్లాడుతూ ప్రజలకు మధ్య వారధిగా పత్రికలు వ్యవహరించాలని ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను మీడియా ద్వారా వెలుగులోకి తెచ్చి ప్రభుత్వం పరిష్కరించేందుకు కృషి చేయాలని ప్రజలకు ప్రభుత్వానికి మీడియా వారిదిగా వ్యవహరించాలని మీడియా మిత్రుల సమస్యలను పరిష్కరించుకోవడానికి యూనియన్ కృషి చేస్తుందని వారు తెలిపారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పి ఆర్ టీ యూ తోనే సాధ్యం



**తిరుమలగిరి (సాగర్)జులై 12,ప్రభాతవార్త :**

మండలం లోని సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బాగంగా కేజీబీవీ తిరుమలగిరి పాఠశాలను పి ఆర్ టీ యూ టీ ఎస్ రాష్ట్ర ప్రధానకార్యి సుంకరి బిక్షంగౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు సాధించడంలో పి ఆర్ టీ యు ఎల్ల వేళలా ముందుంటుంది అన్నారు గతంలో 12 నెలల వేతనం సాధించడం జరిగింది అని ఇంకా వారి టైమ్ స్కేల్ సాదించడం, హాస్టల్ విద్యార్థులకు పర్యవేక్షణ కోసం కేర్ టేకర్ ఏర్పాటు చేయ్యడం లాంటి సమస్యల సాధిస్తామని అన్నారు. . మండల అధ్యక్షులు మొక్క పరుశురాం గౌడ్, అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డి ఆడిట్ కమిటి మెంబర్ బానోతు సక్రునాయక్ మండల ప్రధాన కార్యదర్శి కూన్ రెడ్డి సైదిరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కొనమంచలి శ్రీనివాస్ మంకెన రామచంద్రారెడ్డి, మంత్రాల సురేందర్ రెడ్డి,మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాళం అరుణకుమారి రాష్ట్ర ఉపాధ్యక్షులు కేపీ వెంకటేశ్వర్లు రాష్ట్ర కార్యదర్శి గిన్నె వెంకట్ రెడ్డి, ఎండీ ఫరీద్ , జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జార్జ్, కే ఆనందగిరి, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ బాస్కర్ గౌడ్ , జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చిర్ర మల్లయ్య ,జిల్లా కార్యదర్శి సి హెచ్ బాస్కర్ రెడ్డి, లక్ష్మీరామ్ మండల అసోసియేట్ అధ్యక్షులు పుట్లూరి వెంకటేశ్వర్ రెడ్డి, రమావత్ బద్దు మండల ఉపాధ్యక్షులు వెంకటయ్య, మండల కార్యదర్శి లచ్చుమా మరియు సభ్యులు ప్రభాకర్ రెడ్డి ,శ్రీరాం శ్రీనివాస్, మేరావత్ భాను నాయక్,వీరయ్య, వెంకట్ రెడ్డి, రామాంజి రెడ్డి అశోక్ కార్యవర్గ సభ్యులు. పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆల్బెండోజెల్ మాత్రల పంపిణీ

**నాగార్జునసాగర్, ప్రభాతవా ర్త జులై, 13**

జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా( ఎన్ డి డి) నల్గొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యాధికారి డాక్టర్ నగేష్ ఆదేశాల మేరకు నందికొండ మున్సిపాలిటీ నాగార్జునసాగర్ విద్యార్థులకు సోమవారం నులి పురుగుల నివారణ లో భాగంగా ఆల్బెండోజెల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేసినట్లు అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ సూపర్వైజర్ కమలమ్మ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నులిపురుగుల నివారణకై ఆల్బెండజోల్ మాత్రల ఆవశ్యకత మొదలగు విషయాలపై విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది మానవ శరీరంలోకి నులిపురుగులు ఎలా ప్రవేశిస్తాయి వాటి నివారణ కొరకు ఆల్బెండోజెల్ మాత్రలు వినియోగించే తీరును వివరించారు. నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పైలాన్ కాలనీ, హిల్ కాలనీలలో అంగన్వాడీ పాఠశాలలు, ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలలో 4567 మంది విద్యార్థులకు గాను 4253 మంది



విద్యార్థులకు సోమవారం ఆల్బెండోజెల్ మాత్రలను ఇచ్చినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రవికుమార్, సెయింట్ జోసఫ్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ లలిత, మోడల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు శేషు, ఇండియన్ ప్రిన్సెస్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యాన్సీస్ , స్కూల్ ఆఫ్ ఆక్స్ఫర్డ్ ప్రిన్సిపాల్ శివకుమార్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గంగాబాయి, లింగయ్య, తిరుమలచారి తదితరులు పాల్గొన్నారు.

## వివో ఎలా న్యాయమైన డిమాండ్లనుపరిష్కరించాలి.

**త్రిపురారం, జులై 13, ప్రభాత వార్త:.**

స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్వావ లంబన,ఆర్థిక పరిపుష్టి, సమావేశాల నిర్వహణ, నాయకత్వ లక్షణాల పెంపు, వివిధ రకాల రుణాల ను ఇప్పించడం,చెల్లింపులు గ్రామ సంఘాలలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ గ్రామ సంఘాలను బలోపేతం చేస్తున్న గ్రామ ఆర్గనైజింగ్ అసిస్టెంట్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సంఘం మండలాధ్యక్షులు పడిశల సైదులు అన్నారు. సోమవారం డిమాండ్ల సాధన కొరకు మండల కేంద్రంలో మండల సమాఖ్య కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు ఉద్యోగ భద్రత తో పాటు, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ట్యాబ్ సౌకర్యం కల్పించడంతోపాటు ..20 లక్షల ప్రమాద బీమా పథకాన్ని వర్తింపచేయాలన్నారు. విద్యారసను బట్టి అర్హులైన వారిని సిసిలుగా నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి చల్లా పుష్పలత, కోశాధికారి వజ్రాలు, ధనలక్ష్మి, కుమారి, శిరీష, కళ్యాణి, సరిత,అనిత తదితరులున్నారు.



## ఆపద కాలంలో ఆపన్న హస్తం. పరిమళించిన మానవత్వం.



**త్రిపురారం, జులై 13. ప్రభాతవార్త:.**

స్నేహమేరా జీవితం... క్షేమమేరా శాశ్వతం అన్న సినీ కవి మాటలు నిజం చేస్తూ చిన్ననాటి స్నేహితుడు రోడ్డు ప్రమాదం మృతి చెందడంతో అతని కుటుంబాన్ని ఆదుకునేందుకు ఆనాటి బాల్యమిత్రులు మీకు మేమున్నామంటూ ముందుకు వచ్చారు. వివరాల్లోకెళ్తే మండలంలోని బెజ్జి కల్ గ్రామానికి చెందిన పగిడిపల్లి కళ్యాణ్ రోడ్డు ప్రమాదంలో అ కాల మరణం పొందడంతో అతన్ని కుటుంబాన్ని ఆదుకునేందుకు తమ వంతు సహాయంగా అతని బాల్యమిత్రులు పల్లా నాగరాజు, పల్లా జానకి రాములు ల ప్రత్యేక చొరవతో నాగార్జునసాగర్ గురుకుల పాఠశాల ( బాలురు)2002 2003 పదవ తరగతి బ్యాచ్ కు చెందిన స్నేహితులు ..75,000/ల ఆర్థిక సహాయాన్ని అతని కుటుంబానికి సోమవారం అందజేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్వచ్ఛంద సంకల్పంతో సామాజిక బాధ్యతగా భావించిన అతని స్నేహితులు సేవాభావంతో చేపట్టిన ఈ కార్యక్రమం పలువురికి స్ఫూర్తిదాయకమన్నారు. గ్రామస్తులువారిని అభినందించారు.

# నాగార్జున సాగర్ వార్త

## రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొని యువకుడు మృతి

**పెద్దవూర జూలై 13 ప్రభాతవార్త**



మండల పరిధిలోని తెప్పలమడుగు శివారులో లారీ బైకును ఢీకొట్టడంతో యువకుడికి తీవ్ర గాయాలై మృతి చెందినసంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలం పెద్దగూడెం గ్రామానికి చెందిన చెవుల నగేష్(32 )అను అతను తన మోటార్ సైకిల్ పై పెద్దగూడెం నుండి బయలుదేరి మధ్యాహ్నం పెద్దవూరలోని ఒక ఫంక్షన్ కిహాజరయ్యారు. సాయంత్రం సుమారు 6 గంటలసమయంలో అదే మోటార్ సైకిల్ పై పెద్దవూర నుండి బయలుదేరి పెద్దగూడెం కి వెళుతుండగా 6:30 గంటల సమయంలో అతను తెప్పలమడుగు గ్రామ శివారులోని అమ్మ రైస్ మిల్ సమీపంలోకి వెళ్లేసరికి అదే సమయంలో పెద్దవూర వైపు నుండి హాలియా వైపు వెళ్తున్న లారీ టిఠి 16గిబి15 47 గలది సదరు చెవుల నగేష్ తన ముందు వెళ్తున్న ఇట్టి లారీని ఓవర్టేక్ చేసే క్రమంలో లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీను కుడివైపు తిప్పడంతో మోటార్ సైకిల్ని ఢీ కొట్టింది.దాంతో నగేష్ రోడ్డుపై పడిపోయి తలకు తీవ్ర గాయాలయ్యాయి. అది గమనించి అదే గ్రామానికి చెందిన నవీన్ అను అతను 108 అంబులెన్స్ లో గాయాలతో ఉన్న నగేష్ ను నాగార్జునసాగర్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 7:30 గంటల సమయంలో నగేష్ మరణించడం జరిగింది. . ఇట్టి ప్రమాదానికి కారణమైన సదరు లారీ డ్రైవర్ ధనకొండ మణికంఠ పై మృతుడి భార్య చెవుల మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెద్దవూర పిఎస్ నందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాలరావు తెలిపారు. మృతుడికి భార్య ఒక కుమారుడు కలరు.

## సర్ ను పాదదర్శకంగా నిర్వహించాలి



**హాలియా, ప్రభాతవార్త, జులై 13:**

ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగానిర్వహించాలని హాలియా మున్సిపాలిటీ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం హాలియా మున్సిపల్ కార్యాలయంల్లో బిఎల్ఓ లతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా, అర్హత లేని పేర్లను నిబంధనల ప్రకారం తొలగించేలా బి ఎల్ ఓలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పని చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి అర్హుడికి ఆ హక్కు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది, బిఎల్ఓలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొండమల్లేపల్లిలో ఐకేపీ వీవోఏల ధర్నా

**- రూ.18 వేల కనీస వేతనం,ఉద్యోగ భద్రత**

**కల్పించాలని విజ్ఞప్తి**




**కొండమల్లేపల్లి, జూలై13,(ప్రభాతవార్త):** తెలంగాణ ఐకేపీ వీవోఏల ఉద్యోగుల సంఘం (సీఐటీయూ)ఆధ్వర్యంలో సోమవారం కొండమల్లేపల్లిలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో గత 25 సంవత్సరాలుగా గ్రామీణ పేద మహిళల సాధికారత కోసం నిరంతరం సేవలందిస్తున్న ఐకేపీ వీవోఏలకు నేటికీ కనీస వేతనం,ఉద్యోగ భద్రత లేకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం ఇస్తున్న గౌరవ వేతనం కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఉద్యోగులకు నెలకు రూ.18,000 కనీస వేతనం అమలు చేయడంతో పాటు,10 లక్షల రూపాయల ప్రమాద బీమా,ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు,వార్షిక వేతన పెంపు తదితర డిమాండ్లను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఉద్యోగులకు స్పష్టమైన సర్వీస్ నిబంధనలు రూపొందించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని తెలంగాణ ఐకేపీ వీవోఏల ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) నాయకులు హెచ్చరించారు.అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రం మండల ఏపీఎంకు అందజేశారు.ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి మండల వివోఎలు పాల్గొన్నారు.

## రాంరెడ్డిపల్లిలో వివో భవన ప్రారంభోత్సవం

**మర్రిగూడ, జూలై13,(ప్రభాతవార్త):**



గ్రామాల్లో మహిళా సంఘాల బలోపేతానికి,సంఘాల కార్యకలాపాలు మరింత ముమ్మరంగా సాగడానికి వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన విలేజ్ ఆర్గనైజేషన్ (వివో) భవనాన్ని రాంరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభించారు.మండల పరిధిలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఈ వివో కార్యాలయ భవనాన్ని తహశీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు,ఎంపీడీవో మున్నయ్య,సర్పంచ్ లవంగి నర్సింహ కలిసి కొబ్బరికాయ కొట్టి అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా అధికారులు,సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా,సామాజికంగా ఎదగడానికి వివో భవనాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.ఇకపై గ్రామ మహిళా సంఘాల సమావేశాలు,పొదుపు వ్యాపార లావాదేవీలు ప్రభుత్వ పథకాల అవగాహన సదస్సులు ఈ భవనం వేదికగా సజావుగా నిర్వహించుకోవచ్చని తెలిపారు. గ్రామాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, వారికి అన్ని రకాల వసతులు కల్పించడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నజీరా,వెన్నమనేని సుధాకర్ రావు,మాజీ సర్పంచ్ లవంగి మల్లయ్య, లవంగి అనంతం,వార్డు సభ్యులు లవంగి మహేందర్,వల్లపు హైమా భాస్కర్,సీసీ భారతి,వివికే వెన్నమనేని చంద్రకళ,నాగిళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఓటరు సహకరించాలి

**- సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్‌రెడ్డి**

**చింతపల్లి, జూలై13,(ప్రభాతవార్త):**



చింతపల్లి మండలం తీదేడు గ్రామంలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్(సర్)కార్యక్రమంలో సోమవారం గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,గ్రామం లోని ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకొని అవసరమైన మార్పులు,చేర్పులు,తొలగింపులు ఉంటే సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఓటరు జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేందుకు ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గ్రామ ప్రజలందరూ బూత్ స్థాయి అధికారులకు సహకరించి తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఉలుపాల శేఖర్ రెడ్డి,వార్డు సభ్యులు మాదగోని కృష్ణ గౌడ్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు మర్రు రామారావు,సిమర్ల శ్రీను యాదవ్,వలమోని వెంకటయ్య,గ్రామ పాలన అధికారి యాదయ్య,బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓ)లు గంటెల చంద్రయ్య,చింతకుంట్ల అంజమ్మ,ఎన్నికల సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగానికి యూరియా అందించాలి, కల్తీ ఎరువులు విత్తనాలు మందులను అరికట్టాలి

**- అఖిల భారత రైతు కూలీ సంఘం**

**నకిరేకల్. ప్రభాతవార్త .జూలై 13 :**




అఖిలభారత రైతు కూలి సంఘం (టి.ఏ.సి.టీ) ఆధ్వర్యంలో నకిరేకల్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతాంగ సమస్యలు పరిష్కారించాలని ధర్నా నిర్వహించి తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు .ఈ సందర్భంగా అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి చిరంజీవి మాట్లాడుతూ వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, సాగు ఖర్చులు పెరగడం, పంటలకు గిట్టుబాటు మద్దతు ధరలు లేకపోవడం, రుణభారం పెరగడం వల్ల రైతులు సంక్షోభంలోకి నెట్టబడ్డారు . వ్యవసాయ కూలీలకు ఉపాధి, కనీస వేతనాలు, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.రైతు పంటలకు చట్టబద్ధమైన గిట్టుబాటు మద్దతు ధర సాధన కోసం పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ విధానాలు రైతాంగానికి అనుకూలంగా లేవని, రైతు వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని కోరారు. రైతులు-కూలీల హక్కుల సాధనకు ఐక్య పోరాటాలే మార్గమని పిలుపునిచ్చారు. రైతులకు ఇచ్చిన హామీలను రేవంత్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. యూరియా సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులను సబ్సిడీ ద్వారా ప్రభుత్వమే అందించాలని డిమాండ్ చేశారు. కల్తీ మందులను అరికట్టాలని మరియు రైతు డిస్కం పేరుతో ట్రాన్స్ఫారాలకు స్మార్ట్ మీటర్లను పెట్టడం సరికాదు విద్యుత్ ప్రైవేట్ కరుణ లో భాగంగా ఈ మీటర్లు రాబోయే కాలంలో వ్యవసాయ కనెక్షన్ కు బిగించేందుకు ట్రయల్ మాత్రమే ఉచిత విద్యుత్తును ఎదురగొట్టేందుకు 2003 నాటి చట్టాన్ని ముందుకు తీసుకొస్తుంది కావున ఆ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏ ఐ కె యం ఎస్ ) జిల్లా కోశాధికారి పుట్ట సత్తయ్య,నాయకులు అంబటి మహేష్, ధర్మాబోయిన శివ, ఉమేష్ , భాస్కర్, వెంకటేశ్వర్లు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మునుగోడు వార్త

## ఆరుద్ర నక్షత్రం సందర్భంగా చెర్వుగట్టులో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**నార్కట్‌పల్లి, ప్రభాతవార్త జూలై 13:**




మహాశివుడి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా తెలంగాణ శ్రీశైలంగా ప్రసిద్ధిగాంచిన నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలోని శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని నకిరేకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణల నడుమ పూజా కార్యక్రమాలను నిర్వహించి ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే వేముల వీరేశం రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సుభిక్షంతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



## మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శివాలయంలో ఘనంగా అన్నాభిషేకం

**నార్కట్‌పల్లి, ప్రభాతవార్త జూలై 13:**



మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం నార్కెట్పల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ వెనుక గల శ్రీ శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారికి అన్నాభిషేకం, పంచామృతాభిషేకం, ప్రత్యేక అర్చనలు, సప్తహారతులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నిడిగొండ భగవాన్ శర్మ, కళ్యాణి దంపతులు వేదమంత్రోచ్ఛారణల నడుమ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అన్నాభిషేక సేవను జెరిపోతుల సత్తయ్య-పద్మ దంపతులు, గ్రామ సర్పంచ్ జెరిపోతుల భరత్-నాగలక్ష్మి దంపతులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుల్లెమ్లా శ్రీనివాస్ గౌడ్-మంగమ్మ దంపతులు, వార్డు సభ్యుడు మేడబోయిన మంగ శ్రీనివాస్, గంప కవిత, సామా మాధవి, కురిమెల్లా రఘు-అపర్ణ దంపతులు, వెంకటరెడ్డి-రజిత, పుల్లెమ్లా పద్మతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు.



# వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలి: సీఐటీయూ




శాలిగౌరారం, జూలై 13 (ప్రభాతవార్త):

గ్రామ స్థాయిలో గత 25 సంవత్సరాలుగా సేవలందిస్తున్న వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, నెలకు రూ.18 వేల కనీస వేతనం, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లకపాక రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐకేపీ వీవోఏ ఉద్యోగ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం శాలిగౌరారం ఏపీఎం కార్యాలయం ఎదుట వీవోఏలు ధర్నా నిర్వహించారు. అనంతరం ఏపీఎం పోలేపల్లి శంకర్‌కు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లకపాక రాజు మాట్లాడుతూ, సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామ స్థాయిలో వీవోఏలు గత 25 సంవత్సరాలుగా మహిళల అభ్యున్నతి కోసం అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం అమలు చేస్తున్న అనేక పథకాలను క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేయడంలో వీవోఏల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా వీవోఏలకు నెలకు రూ.18 వేల వేతనం ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రతతో పాటు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ గుండ్లపల్లి వెంకయ్య, ఆశా వర్కర్స్ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు గుండ్ల సైదమ్మ, వీవోఏ సంఘం మండల అధ్యక్షురాలు కల్లూరి రేణుకాదేవి, వీవోఏలు ఎర్ర రాజు, ఇంద్రకంటి శ్రీకన్య, నాగలక్ష్మి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సేవే పరమావధిగా లయన్స్ క్లబ్ సేవలను చేపట్టాలి

**- జిల్లా పాస్ట్ గవర్నర్ రేపాల మదన్ మోహన్**

**- ఘనంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూర్ కింగ్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం**



కట్టంగూర్, జూలై 13, ప్రభాతవార్త:

సమాజ సేవే లక్ష్యంగా ప్రతి లయన్ సభ్యుడు పనిచేస్తూ, సేవా కార్యక్రమాలను గ్రామస్థాయిలో మరింత విస్తరించాలని లయన్స్ క్లబ్ జిల్లా పాస్ట్ గవర్నర్ లయన్ రేపాల మదన్ మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం కట్టంగూర్‌లోని ఎంఎస్ఆర్ సిటీ ఫంక్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూర్ కింగ్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ నూతన అధ్యక్షుడిగా గుడిపాటి శివప్రసాద్, కార్యదర్శిగా మంగదుడ్ల శ్రీనివాస్, కోశాధికారిగా కల్లూరి వెంకటేశ్వర్లుతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన పదాధికారు లను క్లబ్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సభలో రేపాల మదన్ మోహన్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలను విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, రక్తదానం, సామాజిక సంక్షేమం వంటి రంగాల్లో మరింత విస్తరించాలని సూచించారు. నూతన కమిటీ సేవాభావంతో పనిచేసి క్లబ్‌కు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షి ం చారు. కట్టంగూర్ క్లబ్ అనతి కాలంలోనే ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు పొందిందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫాస్ట్ మల్టిపుల్ ఛైర్ పర్సన్ లయన్ తీగల మోహనరావు, జిల్లా మొదటి వైస్ గవర్నర్ కోడే సతీష్, ఫస్ట్ గవర్నర్ డాక్టర్ యానాల మోహన్ రెడ్డి, రెండవ గవర్నర్ గూడపూరి వెంకటేశ్వరావు, జోన్ చైర్మన్ డెంకల సత్యనారాయణ, డీసి మెంబర్ బుడిగె శ్రీనివాసులు, ఎర్ర శంభులింగారెడ్డి, క్లబ్ అడ్వైజర్ రెడ్డిపల్లి సాగర్, చార్టర్ ప్రెసిడెంట్ చిక్కు శేఖర్, పోగుల రాములు, ఉపాధ్యక్షుడు బసవోజు వినోద్ కుమార్, ప్రోగ్రాం చైర్మెన్ కక్కిరేణి నవీన్, శ్రీపాద నందగోపాల్, ఐతగోని లక్ష్మీనారాయణ, కడవేరు మల్లికార్జున్, రాపోలు వెంకటేశ్వర్లు, గోశిక ఉమాపతి, శ్యామల హరీష్, పసునూరి సైదులు, ఆకుల సోమేశ్వర్, వెంకటేష్, లక్ష్మి, గుడిపాటి పద్మ, లత, స్వాతి, బండ మల్లారెడ్డి, చిత్రం నర్సింహా, ఐతగోని సత్యనారాయణ, గుడిపాటి శ్రీనివాసులు, గుడిపాటి రామలింగయ్య, పున్న సుందర్, శ్యామల అశోక్, మన్నెం అంజయ్య, చిక్కు వాణి, రెడ్డిపల్లి వెంకటమ్మ, కల్లూరి సంధ్య, దండెపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో ఉన్న సబ్ సెంటర్‌ను పునర్నిర్మించాలి: సిపిఎం డిమాండ్



కట్టంగూర్, జూలై 13, ప్రభాతవార్త:

మండలంలోని ఈదులూరు గ్రామ సబ్ సెంటర్‌ను సిపిఎం పార్టీ బృందం సోమవారం పరిశీలించింది. సిపిఎం మండల కార్యదర్శి పెంజర్ల సైదులు నేతృత్వంలో పార్టీ కమిటీ సభ్యులు ఈ సర్వే నిర్వహిం చారు. ఈ సందర్భంగా పెంజర్ల సైదులు మాట్లాడుతూ దాదాపు పదివేల జనాభా కలిగిన ఈ సబ్ సెంటర్ పరిధిలో కనీస వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవన స్లాబ్ పూర్తిగా శిథిలమై పేచ్చులు ఊడిపోతోందని, బాత్రూంలు, నీటి సౌకర్యం కూడా లేవని మండిపడ్డారు. సబ్ సెంటర్ ఆవరణమంతా పిచ్చి మొక్కలు, కంపచెట్లతో నిండిపోయి పాము లకు నిలయంగా మారిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యుడు మురారి మోహన్, సీనియర్ నాయకులు పున్న ఆగయ్య, కర్నాటి రాములు పాల్గొన్నారు.

# కరాటే విద్యలో సరికొత్త చరిత్ర సృష్టించిన డిండి విద్యార్థులు..

**- గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మెగా ప్రదర్శన..**

**- గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు**

డిండి జూలై 13, ప్రభాతవార్త:

మార్షల్ ఆర్ట్స్ (కరాటే) రంగంలో నల్లగొండ జిల్లా డిండి మండలా నికి చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి సరికొత్త చరిత్ర సృష్టించారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక మెగా కరాటే ప్రదర్శనలో డిండి విద్యార్థులు పాల్గొని, గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించి జిల్లా కీర్తిపతాకాన్ని ఎగురవేశారు. ఈ మెగా ప్రదర్శనలో భాగంగా విద్యార్థులు 45 నిమిషాల పాటు ఏకధాటిగా, నిరంతరాయంగా కరాటే విన్యాసాలు చేసి వీక్షకులను అబ్బురపరిచారు. ఈ అసాధారణ ప్రదర్శనకు గాను ఈ ఈవెంట్ గిన్నిస్ వరల్డ్ రికార్డుకు ఎంపికైంది. ఈ రికార్డు సాధనలో డిండి మోడల్ స్కూల్ విద్యార్థులు పిట్టల వైశాలి, గొడుగు అక్షి త అద్భుతమైన ప్రతిభను కనబరిచి అందరి ప్రశంసలు అందుకున్నారు. గిన్నిస్ వరల్డ్ రికార్డులో భాగస్వాములై అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న విద్యార్థులు



వైశాలి, అక్షి తలను డిండి మోడల్ స్కూల్ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రికార్డులు సృష్టించడం గర్వకారణంగా ఉందన్నారు. భవిష్యత్తులో వీరు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలని ఆయన ఆకాంక్షి ంచారు. విద్యార్థులను తీర్చిదిద్దిన కరాటే మాస్టర్ లక్పతిని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.




# ఎస్ఐఆర్ సర్వేలో ప్రతి ఓటరు తప్పనిసరిగా పాల్గొనాలి

**- చిరుమర్తి చేయూత ఫౌండేషన్ చైర్మన్ చిరుమర్తి మనోజ్**

నార్కట్పల్లి ప్రభాతవార్త జూలై 13:



ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) సర్వేలో భాగంగా ఈరోజు సంబంధిత బీఎల్ఓల నుంచి ఎన్యూమరేషన్ పత్రాలను స్వీకరించడం జరిగిందని చిరుమర్తి మనోజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందించేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు తమకు అందిన ఎన్యూమరేషన్ పత్రాన్ని పూర్తిగా, సరైన వివరాలతో నింపి, అవసరమైన ధ్రువపత్రాలను జతచేసి, నిర్ణీత గడువులోగా సంబంధిత బీఎల్ఓ లేదా ఎన్నికల అధికారులకు అందజేయాలని కోరారు.

# కేంద్ర ప్రభుత్వ విధానాలతోనే రైతాంగం సంక్షోభంలోకి

**- ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గజ్జి రవి**

**- కట్టంగూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా**

కట్టంగూర్, జూలై 13, ప్రభాతవార్త:




రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కట్టంగూర్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు గజ్జి రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వల్ల దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని మండిపడ్డారు. సాగు ఖర్చులు పెరగడం, పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్రంలోని రేవంత్ ప్రభుత్వం కూడా విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు బూరుగు సత్తయ్య, పెరక శ్రీనివాస్, దండంపెల్లి చంద్రయ్య, గంట మార్కండేయ, రామకృష్ణ, గంట రామకృష్ణ, కందాల ఆది రెడ్డి, గుడుగుంట్ల వెంకన్న, గద్దపాటి అంజయ్య, ఎస్.కె హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# కట్టంగూర్‌లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం..

**కట్టంగూర్, జూలై 13, ప్రభాతవార్త:** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కట్టంగూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, గ్రామాల్లోని విద్యార్థులకు మండల వైద్య సిబ్బంది ఉచితంగా అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ జమున మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనతను నివారించడంతో పాటు వారి శారీరక, మానసిక ఎదుగుదలకు నులిపురుగుల నివారణ ఎంతో కీలకమని తెలిపారు.

# దేవరకొండ - హైదరాబాద్ మార్గంలో నాలుగు కొత్త ఈడీలక్స్ బస్సులు

**- ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ నిర్ణయం**



**దేవరకొండ, జూలై 13, ప్రభాతవార్త:**

దేవరకొండ–హైదరాబాద్ మార్గంలో ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. దేవరకొండ ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాద్ రూట్‌లో నూతనంగా నాలుగు ఎలక్ట్రిక్ డీలక్స్ (ఈడీలక్స్) బస్సులను సోమవారం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా డిపో మేనేజర్ విజయకుమారి మాట్లాడుతూ దేవరకొండ–హైదరాబాద్ మార్గంలో ప్రతిరోజూ ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, వైద్య అవసరాల కోసం ప్రయాణించే వారి సంఖ్య అధికంగా ఉంటోందని, ఈ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నాలుగు కొత్త ఈడీలక్స్ బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బస్సుల్లో దేవరకొండ నుంచి హైదరాబాద్ వరకు ప్రయాణ చార్జీ రూ.170, కొండమల్లేపల్లి నుంచి హైదరాబాద్ వరకు రూ.160గా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ బస్సులు డీలక్స్ కేటగిరికి చెందినవిగా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్షి ్మ ఉచిత బస్సు ప్రయాణ పథకం ఈ సర్వీసులకు వర్తించదని స్పష్టం చేశారు. ఎలక్ట్రిక్ బస్సులు కావడంతో ఇంధన వినియోగం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ఇవి దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన సీట్లు, నిశ్శబ్ద ప్రయాణం, మెరుగైన సేవలు అందేలా ఈ బస్సులను రూపొందించినట్లు తెలిపారు. డిపో పరిధిలోని ప్రజలు ప్రైవేటు వాహనాల కంటే ఆర్టీసీ బస్సులను వినియోగించి సురక్షి తమైన, నమ్మకమైన ప్రయాణాన్ని ఎంచుకోవాలని డిపో మేనేజర్ విజయకుమారి కోరారు. కొత్త ఈడీలక్స్ బస్సుల ప్రారంభంతో దేవరకొండ ప్రాంత ప్రజలకు హైదరాబాద్ ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారనుంది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు, డిపో సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# మైనంపల్లి పాఠశాలలో నులిపురుగుల నివారణకు శ్రీకారం

**- విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రల పంపిణీ**



**దేవరకొండ , జూలై 13, ప్రభాతవార్త :**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మైనంపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులకు స్వయంగా మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో నులిపురుగుల నివారణ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగించడం, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌హెచ్‌పీ స్వాతి మాట్లాడుతూ, ఒకటి నుంచి పందొమ్మిది సంవత్సరాల వయస్సు గల పిల్లలు తప్పనిసరిగా అల్బెండాజోల్ మాత్రలను తీసుకోవడం ద్వారా నులిపురుగుల సమస్యను నివారించవచ్చని తెలిపారు. మాత్రలు తీసుకున్న అనంతరం ఎలాంటి చిన్నపాటి అసౌకర్యం కలిగినా భయపడాల్సిన అవసరం లేదని, అవసరమైతే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు నులిపురుగుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం వంటి ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమం ప్రశాంతంగా నిర్వహించబడగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వెంకట్, కొర్ర శ్రీను, లైన్‌మన్ శివ, పంచాయతీ కార్యదర్శి అంబేద్కర్, పాఠశాల ఉపాధ్యాయుడు జగదీష్, అంగన్‌వాడీ ఆయా కళ్లమ్మతో పాటు గ్రామ పెద్దలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# వివోఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలి..

**- ఉద్యోగ భద్రతతో పాటు హామీ ఇచ్చిన వేతనం అమలు చేయాలని ధర్నా....!**



**దేవరకొండ, జూలై 13, ప్రభాతవార్త :**

గ్రామీణ మహిళా సాధికారత, స్వయం సహాయక సంఘాల బలోపేతంలో కీలక పాత్ర పోషిస్తున్న ఐకేపీ విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వీవోఏలు) తమ సమస్యల పరిష్కారం కోసం మరోసారి ఆందోళన బాట పట్టారు. సోమవారం దేవరకొండ మండల సమాఖ్య కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో వీవోఏ ఉద్యోగులు ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి తమ డిమాండ్లను వినిపించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య, వీవోఏ ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడు ముదిగొండ రామదాసు మాట్లాడుతూ.. గత 25 సంవత్సరాలుగా వీవోఏలు గ్రామీణ స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు వెన్నెముకలా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. మహిళా సంఘాల ఏర్పాటు, బ్యాంకు రుణాల అనుసంధానం, జీవనోపాధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సామాజిక అవగాహన కార్యక్రమాలు వంటి అనేక బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్నప్పటికీ వారికి తగిన గుర్తింపు, గౌరవం, ఉద్యోగ భద్రత లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో వీవోఏలకు నెలకు రూ.18 వేల వేతనం అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అనంతరం సెర్ప్ సీఈఓతో రాష్ట్ర సంఘం జరిపిన చర్చల్లో ఇచ్చిన హామీలను కూడా ఇప్పటి వరకు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వీవోఏలపై రోజురోజుకూ పని భారం పెరుగుతోందని, అయితే అందుకు తగ్గ వేతనం లేక కుటుంబాలను పోషించడమే కష్టంగా మారిందన్నారు. తక్కువ పారితోషికంతో ఎక్కువ బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తోందని, ఉద్యోగ భద్రత లేక భవిష్యత్తుపై ఆందోళన నెలకొందని తెలిపారు. వీవోఏలకు కనీస వేతన చట్టం ప్రకారం వేతనం అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణమే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం తమ సమస్యలను వివరిస్తూ పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల సమాఖ్య ఏపీఎంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగేష్, చెన్నయ్య, దశరథ్, శేఖర్, కృష్ణమ్మ, శంకర్, జంగమ్మ, స్వప్న, మల్లీశ్వరి, సుశీల, నిర్మల, కొండలమ్మ, వెంకటయ్యతో పాటు పలువురు వీవోఏ ఉద్యోగులు పాల్గొన్నారు.

## నల్లగొండ వార్త

# ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తం

**- తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి**

**- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

నల్గొండ, ప్రతినిధి, ప్రభాతవార్త, జూలై 13:



ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షపాతం లేకపోవడంతో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వినతులు స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు ఉన్నందున జిల్లాలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, హాస్టళ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల స్థాయి అధికారులు ప్రతి రెండు వారాలకు ఒకసారి హాస్టళ్లు, పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాలను తప్పనిసరిగా తనిఖీ చేసి, వాటి నివేదికలను స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ సమర్పించాలని సూచించారు. పాఠశాల విద్యార్థుల యూనిఫాంను ఈ నెల 15వ లోగా రెసిడెన్సియల్ పాఠాశాలల బాలికలకు పంపిణీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈ సోమవారం మొత్తం 105 దరఖాస్తులు రాగా, రెవెన్యూ శాఖ కు 55, తక్కిన శాఖలకు 50 వచ్చాయి. రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు ప్రజల వద్ద నుండి దరఖాస్తుల స్వీకరించారు.

# ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా భూముల రీ సర్వేను నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

**నల్గొండ టౌన్ జూలై 13, ప్రభాతవార్త:**

నల్గొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో భూముల రీ సర్వే విషయమై సోమవారం సర్వేయర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేయర్లు సర్వే నిర్వహించే సమయంలో గతంలోని సర్వే రికార్డులను ఆధారం చేసుకుని సర్వే నిర్వహించాలని, సర్వే నంబర్ ట్యాలీ చేసుకుని నిర్ధారణకు వచ్చిన తర్వాత సర్వే చేయాలన్నారు. టీపన్ మ్యాప్ కూడా సర్వే సమయంలో దగ్గర ఉంచుకోవాలని, సర్వేలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. సర్వేలో తప్పిదాలు జరిగితే కోర్టు కేసులు నమోదయ్యే ఆస్కారం ఉంటుందని, అందువల్ల పూర్తి అత్యంత అప్రమత్తంగా ఉంటూ సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఒక గ్రామంలో సర్వే నిర్వహించే సమయంలో ప్రభుత్వ భూములు, పట్టా భూములు, ప్రాజెక్టుల కింద ఉన్న భూములు, అలాగే గ్రామ కంఠం, గ్రామపంచాయతీ, మున్సిపల్ భూములు అన్నింటిని దృష్టిలో ఉంచుకొని సర్వే నిర్వహించాలన్నారు. సర్వేలో చైన్ మరియు రోవర్ లను ఉపయోగించాలని, చట్టం ప్రకారమే నియమనిబంధనలను అతిక్రమించకుండా సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జే .శ్రీనివాస్, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు

## హైకోర్టు స్టేటస్‌కో ధిక్కరణకు యత్నమా

స్కూల్ ప్రధాన గేటు ముందు ప్రహరీ గోడ నిర్మాణ ప్రయత్నంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**బీబీనగర్, జూలై 13 ప్రభాతవార్త**


యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లోని లిటిల్ బడ్స్ హైస్కూల్ ప్రధాన గేటు ముందు హైకోర్టు జారీ చేసిన స్టేటస్‌కో ఉత్తర్వులను పట్టించుకోకుండా రాత్రి వేళల్లో ప్రీ కాస్ట్ ప్రహరీ గోడ నిర్మించేందుకు యత్నించారని ఆరోపణలు రావడం చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పాఠశాల కరస్పాండెంట్ మల్లగారి శ్రీనివాస్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, 2008 సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ అనుమతులతో చట్టబద్ధంగా కొనసాగుతున్న లిటిల్ బడ్స్ హైస్కూల్ ప్రధాన గేటు ముందు అర్ధరాత్రి సమయంలో గ్రామపంచాయతీ కార్యదర్శి కొందరు ప్రైవేట్ వ్యక్తులతో కలిసి ప్రీ కాస్ట్ ప్రహరీ గోడ నిర్మాణానికి ప్రయత్నించినట్లు ఆరోపించారు. గేటు వద్ద శబ్దాలు వినిపించడంతో పాఠశాల యాజమాన్యం బయటకు వచ్చేసరికి అక్కడ ఉన్న వ్యక్తులు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. అనంతరం ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ స్థలానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న జూ.శి.వ్ని.34784/2025 కేసులో స్టేటస్‌కో కొనసాగించాలని న్యాయస్థానం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, వాటిని ఉల్లంఘిస్తూ నిర్మాణానికి యత్నించడం న్యాయస్థాన ఆదేశాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లేనని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈ ఘటన వెనుక ఉన్న కారణాలపై గ్రామపంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించగా, కొందరు మాజీ ప్రజాప్రతినిధుల ఒత్తిడితోనే నిర్మాణం చేపట్టాలని ప్రయత్నించినట్లు ఆయన చెప్పినట్లు శ్రీనివాస్ ఫిర్యాదులో ఆరోపించారు. ఈ అంశంపై కూడా నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని జిల్లా యంత్రాంగాన్ని కోరారు. పాఠశాల ముందు ఉన్న ఖాళీ స్థలం ఎన్నో ఏళ్లుగా గ్రామంలోని చిన్నారుల ఆటస్థలంగా ఉపయోగపడుతోందని, గతంలో గ్రామసభతో పాటు గ్రామపంచాయతీ కూడా అక్కడ ఎలాంటి శాశ్వత నిర్మాణాలు చేపట్టరాదని తీర్మానాలు చేసిన విషయం అధికారులకు తెలిసిందేనని ఆయన పేర్కొన్నారు.

# జలాశయాల్లో అడుగంటుతున్న నీరు

- యాదాద్రి జిల్లాలో దాహం..! దాహం
- సగానికే పరిమితమైన తాగునీటి సరఫరా
- 88.76 ఎంఎల్‌డీ అవసరానికి 51.19 ఎంఎల్‌డీ మాత్రమే పంపిణీ
- రోజు విడిచి రోజు మిషన్ భగీరథ నీరు.
- .ట్యాంకర్లే దిక్కుఎండిపోతున్న బోర్లు...
- 33 గ్రామాల్లో అద్దె బోర్లతోనే సరఫరా
- హెచ్ఎండబ్ల్యూఎస్ పరిధిలో తీవ్ర సంక్షోభం..
- . రిజర్వ్ ఫారెస్ట్ అనుమతు రాక నిలిచిన పైప్‌లైన్ పనులు
- వచ్చే వేసవిపై ఇప్పుడే ఆందోళన...

**యాదాద్రి భువనగిరి బ్యూరో, ప్రభాతవార్త:**

వర్షాకాలం ప్రారంభమై రోజులు గడుస్తున్నా... యాదాద్రి భువనగిరి జిల్లాలో తాగునీటి పరిస్థితి మాత్రం రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతోంది. సాధారణంగా ఈ సమయంలో జలాశయాలు నిండిపోవాల్సి ఉండగా, ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేకపోవడం, ప్రధాన వనరుల్లో నీటిమట్టం తగ్గిపోవడం, పంపింగ్ సామర్థ్యం క్షీణించడం వల్ల జిల్లాలో మంచినీటి సంక్షోభం మెల్లగా ముదురుతోంది. ప్రభుత్వం ప్రతి ఇంటికీ నిరంతర తాగునీరు అందిస్తున్నామని ప్రకటిస్తున్న వేళ, అధికారిక గణాంకాలే జిల్లాలో నీటి కొరత తీవ్రతను బయటపెడుతున్నాయి. జిల్లాలోని 717 ఆవాస గ్రామాలు, ఆరు మున్సిపాలిటీలకు ప్రతిరోజూ 88.76 మిలియన్ లీటర్ల (ఎంఎల్‌డీ) తాగునీరు అవసరం ఉండగా, ప్రస్తుతం 51.19 ఎంఎల్‌డీ మాత్రమే సరఫరా జరుగుతోంది. అంటే మొత్తం అవసరంలో కేవలం 57.67 శాతం మాత్రమే అందుతుండగా, 37.57 ఎంఎల్‌డీ లోటు కొనసాగుతోంది. ఇటీవల మరో 50 లక్షల లీటర్ల నీటి సరఫరా తగ్గిపోవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చింది. దీంతో అనేక గ్రామాల్లో రోజువారీ సరఫరా నిలిపివేసి రోజు విడిచి రోజు మిషన్ భగీరథ నీటిని విడుదల చేస్తున్నారు. జిల్లాలో అత్యధిక ప్రాంతాలకు నీటిని అందిస్తున్న హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్) పరిధిలో పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. ఈ పరిధిలోని 516 గ్రామాలు, పట్టణాలకు రోజుకు 64.54 ఎంఎల్‌డీ అవసరం ఉండగా కేవలం 29.98 ఎంఎల్‌డీ మాత్రమే సరఫరా అవుతోంది. అంటే సగానికి పైగా నీరు అందడం లేదు. ముఖ్యంగా ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లోని గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. జిల్లా కేంద్రం భువనగిరిలోనూ పరిస్థితి అంతే తీవ్రంగా ఉంది. అనేక కాలనీల్లో మూడు, నాలుగు రోజులకోసారి మాత్రమే కుళాయిలకు నీరు వస్తుండటంతో కుటుంబాలు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లపై ఆధారపడుతున్నాయి. ఒక్కో ట్యాంకర్‌కు వేల రూపాయలు చెల్లించాల్సి రావడంతో సామాన్య కుటుంబాలపై అదనపు భారం పడుతోంది. వాటర్ ప్లాంట్ల వద్ద కూడా డిమాండ్ పెరిగి, నీటి కోసం క్యూలు కనిపిస్తున్నాయి.




భూగర్భ జలాల పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉంది. జిల్లాలో ఇప్పటికే వందలాది బోర్లు నీటిని కోల్పోతుండగా, అనేక గ్రామాల్లో చేతి పంపులు కూడా పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. ప్రస్తుతం 33 గ్రామాల్లో అద్దె బోర్ల ద్వారా, 351 చేతిపంపులు, 35 ఓపెన్ వెల్‌ల ద్వారా ప్రత్యామ్నాయంగా తాగునీరు అందిస్తున్నారు. అయినప్పటికీ అనేక గ్రామాల్లో అవసరానికి సరిపడా నీరు అందడం లేదు. పరిస్థితి మరింత విషమించకుండా ఉండేందుకు పలువురు సర్పంచ్‌లు గ్రామపంచాయతీ నిధులతో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామపంచాయతీలపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. జిల్లాలోని వివిధ నీటి సరఫరా వ్యవస్థల పనితీరు కూడా అసమానంగా ఉంది. ఆలేరు ప్రాంతంలో 1.72 ఎంఎల్‌డీ అవసరానికి 1.53 ఎంఎల్‌డీ సరఫరా చేస్తుండగా, వైటీడీఏ పరిధిలో 1.00 ఎంఎల్‌డీ అవసరానికి కేవలం 0.75 ఎంఎల్‌డీ మాత్రమే అందుతోంది. ఏకేబీఆర్ రిజర్వాయర్ పరిధిలో 14 ఎంఎల్‌డీ అవసరానికి 11.26 ఎంఎల్‌డీ సరఫరా జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాలకు అవసరమైన నీటిలో గణనీయమైన లోటు కొనసాగుతోంది. మరోవైపు ఉదయసముద్రం ఆగ్మెంటేషన్ పథకం పరిధిలో మాత్రం దాదాపు పూర్తి స్థాయిలో నీటి సరఫరా కొనసాగుతుండటం కొంత ఊరటనిస్తోంది. జిల్లాలో దీర్ఘకాలిక తాగునీటి సమస్యకు పరిష్కారంగా ప్రభుత్వం మల్లన్నసాగర్ నుంచి నీటిని తరలించే రూ.210 కోట్ల ప్రాజెక్టు చేపట్టింది. యాదగిరిగుట్ట వరకు పనులు వేగంగా సాగినప్పటికీ, సిద్ధిపేట జిల్లా సరిహద్దులోని లాల్‌గడ్-మలన్‌పేట రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో సుమారు రెండు కిలోమీటర్ల పైప్‌లైన్ తవ్వకాల పనులు నిలిచిపోయాయి. ఈ ఒక్క అడ్డంకి కారణంగా మొత్తం ప్రాజెక్టు పూర్తిలో జాప్యం ఏర్పడుతోంది. అధికారులు పలుమార్లు అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపినా ఇంకా స్పష్టత రాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. నీటి సరఫరా తగ్గిపోవడంతో అనేక గ్రామాల్లో ప్రజలు మళ్లీ బోర్లు, ప్రైవేట్ వాటర్ ప్లాంట్లు, ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో మహిళలు ఉదయం నుంచే నీటి కోసం పాత్రలతో కుళాయిల వద్ద వేచి ఉండాల్సి వస్తుండగా, మరికొన్ని చోట్ల ఒకే రోజు వచ్చిన నీటిని రెండు రోజులకు సరిపడా నిల్వ చేసుకోవాల్సి వస్తోంది. గ్రామాల్లో నీటి పంపిణీ సమయాలపై తరచూ వివాదాలు కూడా తలెత్తుతున్నట్లు సమాచారం. వర్షాకాలంలోనే పరిస్థితి ఇంత తీవ్రంగా ఉంటే, రాబోయే వేసవిలో జిల్లా తీవ్ర తాగునీటి సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని నీటి వనరుల నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటి నుంచే జలాశయాల నిర్వహణ, పంపింగ్ స్టేషన్ల సామర్థ్య పెంపు, లీకేజీల నివారణ, కొత్త బోర్ల ఏర్పాటు, ప్రత్యామ్నాయ వనరుల అభివృద్ధి, మల్లన్నసాగర్ ప్రాజెక్టు పనుల వేగవంతం వంటి చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా, మిషన్ భగీరథ ఇంట్రా జిల్లా కార్యనిర్వహణ అధికారి కరుణాకర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైన చోట్ల ప్రత్యామ్నాయ బోర్లు, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. అయితే క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న నీటి కొరతను చూస్తుంటే, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం కోసం పెండింగ్ ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తిచేయాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.




## సహకార సంఘాలను కాపాడుకోవాలి

**రామన్నపేట, జూలై 13 ప్రభాతవార్త**



చేనేత సహకార సంఘాలు ఉ ంటేనే కార్మికులకు మేలు జరుగుతుందని, సహకార సంఘాలను ˇ అవసరం ప్రతి చేనేత వృత్తిదారులపై ఉందని శ్రీ మార్కండేయ సిల్క్ చేనేత సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం జనంపల్లి అధ్యక్షులు సంగిశెట్టి సుదర్శన్ అన్నారు. సోమవారం మండలంలోని జనంపల్లి చేనేత సహకార సంఘంలో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షులుగా సంగిశెట్టి సుదర్శన్, ఉపాధ్యక్షులుగా సంగిశెట్టి విజయలక్ష్మి, కార్యదర్శిగా వనం శంకర్, కోశాధికారిగా పున్న శ్రీధర్, డైరెక్టర్గా కర్నాటి రమేష్, కైరంకొండ బిక్షం, సంగిశెట్టి గణేష్, సంగిశెట్టి కళమ్మ, సూరపల్లి మహాలక్ష్మి లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బండ సరోజ అంజిరెడ్డి, చేనేత వృత్తిదారులు, కార్మికులు నూతన కార్యవర్గాన్ని సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

## న్యాయవాది గాజుల భద్రయ్య సేవలు మరువలేనివి

**భువనగిరి రూరల్ జూలై 13 ప్రభాతవార్త**




ప్రముఖ న్యాయవాది గాజుల భద్రయ్య సంతాప సభ సోమవారం ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి కుమార్ ఆధ్వర్యంలో భువనగిరి బార్ అసోసియేషన్ హాల్లో నిర్వహించి రెండు నిమిషాల మౌనం పాటించారు.ఈ సందర్భంగా ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, న్యాయవాది మామిడి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గాజుల భద్రయ్య న్యాయవాద వృత్తికి,సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షులు అడ్వకేట్ నీసంగి విద్యాసాగర్ మాట్లాడుతూ, గాజుల భద్రయ్య వృత్తిపట్ల నిబద్ధత,యువ న్యాయవాదులకు ఆదర్శమని అన్నారు.ఈ సంతాప సభా కార్యక్రమానికి జిల్లా గౌరవ అధ్యక్షులు సోమయ్య,మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి.వి. గౌడ్, బొడ్డు కిషన్, ఐ లు జిల్లా నాయకులు జిట్టా భాస్కర్ రెడ్డి, హరిప్రియ, ఎర్ర రేణుక, జైపాల్ రెడ్డి, సూదగాని శంకర్, భువనగిరి బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి వుడతల సురేష్, నరాల మహేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## చెక్కు బౌన్స్ కేసుల పట్ల బ్యాంకు మేనేజర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**భువనగిరి రూరల్ జూలై 13 ప్రభాతవార్త**

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజు ఆధ్వర్యంలో బ్యాంకు మేనేజర్లతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం నిర్వహించనున్న లోక్ అదాలత్ లో బ్యాంకుల మేనేజర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి చెక్ బౌన్స్ కేసుల పరిష్కారంలో పరిధులను అనుసరించి మినహాయింపు ఇచ్చినట్లయితే అధిక కేసులు పరిష్కరింపబడుతాయని సూచించారు. చెక్ బౌన్స్ కేసులు పరిష్కరించుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు బాధితులకు సరైన ప్రచారం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మాధవి లత, ఎస్ బి ఐ, యు బి ఐ, తెలంగాణ గ్రామీణ బ్యాంకు, లీడ్ బ్యాంకు మేనేజర్ లు పాల్గొన్నారు

# సాగునీటిపారుదల పనులను సకాలంలో పూర్తి చేయాలి

మిర్యాలగూడ ఎమ్మెల్యే బిఎల్ఆర్

మిర్యాలగూడ, జులై 13. ప్రభాతవార్త:.

మిర్యాలగూడ నియోజకవర్గంలో రైతులకు ఎలాంటి సాగునీటి ఇబ్బందులు తలె త్తకుండా పురోగతిలో ఉన్న సాగునీటిపారుదల పనులను సకాలంలో పూర్తి చేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి( బి ఎల్ ఆర్ ) అన్నారు. సోమవారం ఈ మేరకు ఆయన క్యాంపు కార్యాలయంలో సాగునీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు ఆయన సంబంధిత శాఖ అధికారులతో కలిసి నియోజకవర్గ పరిధిలో .. 11 కోట్లతో చేపట్టిన సాగర్ ఎడమ కాలువ మరమ్మ త్తు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనుల పురోగతిని స్వయంగా తనిఖీ చేసి ఎ లాంటి నిర్లక్ష్యం లేకుండా పనులను నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని సాగర్ ఆయకట్టు నీ టితో పూర్తిస్థాయిలో చెరువులను నింపి భూగర్భ జలాలను పరిరక్షించి బోర్లు బావల ద్వారా వ్యవసాయ అవసరాలకు సరిపడా నీటిని వినియోగించుకునేలా చూడాలన్నారు. ప్రస్తుతం వాన కాలం పంటల సాగును దృష్టిలో ఉంచుకొని కాలువ మరమ్మతులు త్వ రిత గతిన పూర్తిచేసి రైతులకు సకాలంలో సాగు నీ రందేలా అన్ని చర్యలు తీసుకోవాలని



అధికారులను ఆదేశించారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత చేస్తున్నందున వ్యవసాయ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసువులు కల్పనలో ఎలాంటి రాజీ ఉండదని సాగునీటి సౌకర్యాలు మెరుగుపడేలా నిరంతరం అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సరఫరా శాఖ అధికారులు పర్యవేక్షక ఇంజనీర్ మల్లికార్జునరావు, కార్యనిర్వాహ క ఇంజనీర్లు గోపీనాథ్, మనోహర్, పలువురు డి ఇ లు, జె ఈ లు, ఏ ఈ లు తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరం

మిర్యాలగూడ, జులై 13 ప్రభాతవార్త



విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని మండల విద్యాధికారి రమావత్ వరలక్ష్మి అన్నారు. సోమవారం అడవి దేవులపల్లి మండలం ఉల్సాయిపాలెంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీఎం పోషణ్ పంచ భోజన తిథి భోజనం కార్యక్రమాన్ని మండల విద్యాధికారి నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు మెనూ ప్రకారం బలవర్ధకమైన ఆహారాన్ని అందించడమే తిథి భోజనం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పండ్లు,కూరగాయలు, చికెన్‌తో కూడిన పౌష్టికాహారాన్ని అందించేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. అనంతరం ఎంఈఓ వరలక్ష్మి మనవడు మిధాన్ష్ పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ప్రత్యేక చికెన్ భోజనం,అరటి పండ్లు,చాక్లెట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయబృందం చంద్రశేఖర్,రామకృష్ణ,సింధు తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ భూమిని కాపాడాలని ప్రజావాణిలో ఫిర్యాదు

మిర్యాలగూడ, జులై 13 ప్రభాతవార్త

మిర్యాలగూడ మండలం కాల్వపల్లిలో సర్వే నెంబరు 198 లో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురి అవుతుందని, దానిని కాపాడాలని కోరుతూ సోమవారం ప్రజావాణి లోని మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి కు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సర్వేనెంబర్ 198లో పోరంబోకు భూమి సుమారు 60 ఎకరాల ఉందని, ఆ భూమిలో కొంతమంది వ్యక్తులు పెద్ద,పెద్ద వృక్షాలు, గుండ్లు రాళ్ల ను తొలగించి భూమిలోని మట్టిని అమ్ముకుంటున్నారని ఆరోపించారు. మట్టి ఎత్తిన తర్వాత ఆ భూమిని జెసిబిలతో చదును చేసి కొంతమంది ఆ భూమిని



ఆక్రమించుకుంటున్నారన్నారు. ప్రభుత్వ భూములు లేక ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలకు అవసరమైన స్థలాలు లేక వివిధ గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, ఇప్పటికే 198 సర్వే నెంబర్లు 40 ఎకరాలు ఆక్రమణకు గురైందని వారన్నారు. ఆయన వెంట ఏ నరహరి, బి నాగరాజు, ఏ మంగమ్మ, చిలకల గంగయ్య, తదితరులు ఉన్నారు.

## పర్యావరణాన్ని కాపాడుదాం, భావి తరాలకు బతుకునిద్దాం

ఏపీఓ నంద్యాల శ్రీనివాస్ రెడ్డి

మాడుగులపల్లి, జులై 13 ప్రభాత వార్త

జల సంచాయి, జన్ భాగిదారి కార్యక్రమం లో భాగంగా, సోమవారం మండల కేంద్రం లోని, ఉపాధిహామీ ఏపీఓ నంద్యాల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో,కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థు లకు, నీటి పొదుపు, మొక్క లపెంపకం, పర్యావరణ పరి రక్షణ, పై విద్యార్థులకు అవగా హన కల్పించారు. ఇంకుడు గుంతల ద్వారా నీటిని పొదుపు చేయవచ్చని, అందుకు, ప్రతి ఒక్కరు ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత లు



తవ్వాలని అన్నారు. కార్యక్రమం లో,సర్పంచ్ ఆరూరి నరేష్,ఉప సర్పంచ్ మల్లె పల్లి వెంకన్న, మండల విద్యాధికారిణి సీ ఎచ్ వెంకటమ్మ ,పాఠశాల ఎస్ఓ సునీత,పంచాయతీ సెక్రటరీ ఉబ్బ పల్లి శ్రవణ్ కుమార్, టీ ఏ యాదగిరి,ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్వరి తదితరులున్నారు.

## ఎరువుల విక్రయాలను పారదర్శకంగా నిర్వహించాలి

మిర్యాలగూడ, జులై 13. ప్రభాతవార్త:.



ప్రస్తుత వానాకాలం రైతుల అవసరాల కొరకు విక్రయిస్తున్న ఎరువులను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు విక్రయించాలని మిర్యాలగూడ మండల వ్యవసాయ అధికారి మేకల ఋశ్యంద్రమణి అన్నారు. సోమవారం శ్రీ సాయి మహేశ్వర ఫెర్టిలైజర్స్, సిద్ధి వినాయక ఫర్టిలైజర్స్ లో నిర్వహించిన తనిఖీల్లో ఎరువుల నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్ కు పంపించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆ మాట్లాడుతూ ఎరువుల విక్రయాలు ఎలాంటి మోసాలు జరగకుండా రికార్డులు స్టాక్ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎరువుల డీలర్లు తెడ్ల జవహర్ బాబు, భిక్షం, శ్రీనివాస్ తదితరులున్నారు.

## సింగర్ జానకి సేవలు చిరస్మరణీయం

మిర్యాలగూడ కళాకారుల ఘన నివాళి:

మిర్యాలగూడ, జులై 13 ప్రభాతవార్త

పట్టణంలోని సుందరయ్య పార్క్‌లో ప్రముఖ గాయని ఎస్. జానకి కి సోమవారం స్థానిక కళాకారులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జానకి తెలుగు సినీ సంగీతానికి అందించిన విశిష్ట సేవలను కళాకారులు స్మరించుకున్నారు. అనంతరం కళాకారులు మాట్లాడుతూ, మధురమైన గానంతో కోట్లాది మంది సంగీతాభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన గానకోకిల జానకి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆమె ఆలపించిన వేలాది పాటలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. ఆమె గానమాధుర్యం తెలుగు సంగీత చరిత్రలో ఎప్పటికీ చెరగని ముద్రగా నిలుస్తుందన్నారు. ఏలె సత్యనారాయణ, కందుకూరి సుదర్శన్, జకినాలపల్లి శ్రీనివాసచారి, వీర ప్రతాప్, ఎం. సత్యనారాయణ చారి,గుంటోజు సత్యనారాయణ, డాక్టర్ రాజు, కస్తూరి ప్రభాకర్, డాక్టర్



పసుపులేటి సుజాత, కొట్రావత్ సరస్వతి, ఆచంట శైలజ, అరుణ, ఆదిమల్ల ఎల్లయ్య, సత్యనారాయణ, కె. జ్యోతి, ఉపేంద్ర చారి, జి యాదయ్య తదితరులు పాల్గొని జానకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమం అనంతరం జానకి ఆలపించిన ఎన్నో చిరస్మరణీయ గీతాలను కళాకారులు ఆలపిస్తూ ఆమెకు సంగీత నివాళి అర్పించారు.

## వనమహోత్సవం లో భాగంగా మొక్కల పంపిణి

.మాడుగులపల్లి, జులై 13 ప్రభాత వార్త

వనమహోత్సవంలో భాగంగా గారకుంట పాలెం గ్రామం లో, ఇంటింటికి మొక్కలను పంపిణి చేసి,మొక్క నాటిన సర్పంచ్ పెద్ది కృపాకర్ గౌడ్, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరి రక్షణకు, నీటిని పొదుపు చేస్తూ,మానవ జాతి మనుగడకు,పర్యావరణాన్ని కాపాడుతూ,ఇంకుడు గుంతల ద్వారా నీటిని సంరక్షించాలని గ్రామ ప్రజలకు సూచించారు.కార్యక్రమం లో,ఉప సర్పంచ్ జొన్నలగడ్డ లక్ష్మారెడ్డి, పంచా యతీ సెక్రటరీ రావుల రమేష్ వార్డు సభ్యులు, గ్రామపెద్దలు గ్రామ పారిశుధ్య కార్మికులు తదితరులున్నారు.



# ప్రతి కుటుంభం నుంచి నింపిన ఎన్యూమరేషన్ ఫారాలను శ్రద్ధగా తీసుకోవాలి...

**- తహశీల్దార్ సుధారాణి**

మేళ్లచెర్వు, జులై 13 ప్రభాతవార్త:

మండల కేంద్రమైన మేళ్ళచెర్వులో వివిద గ్రామాలలో సోమవారం సమగ్ర ఓటర్ ప్రత్యేక సవరణ సర్వే, సర్ కార్యక్రమాలను తహశీల్దార్ సుధారాణి పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ బి.ఎల్.ఓ.లు ప్రతి కుటుంబం నుంచి నింపిన ఎన్యూమరేషన్ ఫారాలను శ్రద్ధగా తీసుకోనే ప్రయత్నం చేయాలని ఓటర్లకు అన్ని విదాల సహాయ సహకారములు అందించాలని గ్రామంలోని ఓటర్లకు తమ ఓటు హక్కును కోల్పోకుండా చూడాలని సర్ కార్యక్రమాలను శ్రద్ధగా సమర్థవంతంగా వేగవంతంగా చేయాలని కోరారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ప్రభుత్వ సిబ్బంది, గ్రామ పెద్దలు, మేథావులు, విద్యావంతులు, నిరక్షరాస్య ఓటర్లకు సహకరించాలని గ్రామీణ ప్రజల ఓటు హక్కుకు భంగం కలగకుండా చూడాలని ఓటర్లకు పూర్తిస్థాయిలో శ్రద్ధగా సహాయ సహకారములు అందించాలని కోరారు. ఈ కార్యక్రమాలలో బి.ఎల్.ఓలు, బి.ఎల్.ఏలు, కార్యదర్శులు, ప్రభుత్వ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆల్బెండజోల్ మాత్రలతో విద్యార్థులకు ఆరోగ్య రక్షణ

**- మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్**

హుజూర్ నగర్ టౌన్, జూన్ 13, ప్రభాతవార్త :



చిన్నారులు, విద్యార్థులు ఆల్బెండజోల్ మాత్రలు తీసు కోవడం ద్వారా నులి పురుగు లను నివారించి సమగ్ర ఆరో గ్యాన్ని కాపాడుకోవచ్చని మున్సి పల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జాతీ య డివార్మింగ్ డే కార్యక్రమం లో భాగంగా హుజూర్ నగర్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలో విద్యార్థులకు ఆల్బెండ జోల్ మాత్రలను వైద్య సిబ్బం దితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను తీసు కోవాలన్నారు. పేగులో నులి పురుగులను నివారించడానికి వైద్య సిబ్బంది అందిస్తున్న మాత్రలను తీసుకొని ఆరోగ్యా లను కాపాడుకోవాలని కోరారు. విద్యార్థులు, పిల్లల ఆరోగ్యం మెరుగు గా ఉన్నప్పుడే, చదు వులో ఏకాగ్రత పెరుగు తుందని అన్నారు. ఈ సందర్భంగా ఆర్ బి ఎస్ కే వైద్యులు డాక్టర్ నాగేంద్రబాబు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మ లు మాట్లా డుతూ ఆల్బెండజోల్ మాత్ర లను తీసుకోవడంలో ఉప యోగాలను వివరించారు. పట్టణం లోని 19 వార్డులోని వి వి యం స్కూల్లో విద్యార్థులకు కౌన్సి లర్ వల్లపుదాసు కృష్ణ గౌడ్, ఎస్కే సైదాలు ఆల్బెండ జోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సి లర్ శీలం నాగమణి డాక్టర్ మంగ, పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ ఆర్ పద్మ, ఇందిరాల రామకృష్ణ, వై.ఉమ, హెచ్ఎంలు తాత రాజు శ్రీని వాస్, సిస్టర్ అనిత, డాక్టర్ మంగ హెల్త్ సూపర్వైజర్ ఇందిరాల రామకృష్ణ, ఉమా, శ్రీదేవి, నగేష్ హరీష్ ఆశా కార్య కర్తలు సీత, సుశీల, లలిత లు పాల్గొన్నారు.

# 14 వవార్డులోసర్ వోటర్ ఫారంలపై హెల్ప్ డెస్క్

**నేరేడుచర్ల జూలై13 ప్రభాతవార్త:** నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని 14 వ వార్డు కౌన్సిలర్ సరికొప్పుల విజయలక్ష్మి నాగేశ్వర రావు ఆధ్వర్యం లో సర్ ఫారం ల పై హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు, ఈ హెల్ప్ డెస్క్ లో సర్ ఫారం లు నింపడం లో అవగాహన లేని వారికి, ఫారం లు అందని వారికి ఆన్లైన్ లో సెర్చ్ చేసి అందించడం, పాత వోటర్ లిస్ట్ గురించి సెర్చ్ చేయడం లాంటివి చేసి వార్డ్ ప్రజలతో పాటు,నేరేడుచర్ల మున్సిపాలిటీ ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తున్నారు, ఈ కార్యక్రమం నిర్వహించడం ఓటర్లు పై హర్షం వ్యక్తం చేసి అభినందించారు నేరేడుచర్ల తాసిల్దార్ సురగి సైదులు సూచనల మేరకు, స్థానిక బిఎల్ఓ లు, ఆర్పి లు అందరి తో కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా 5 రోజుల నుండి నిర్వహిస్తున్నారుఈ కార్యక్రమం లో, జనసేన పార్టీ హుజూర్నగర్ ఇంచార్జ్ సరికొప్పుల నాగేశ్వర రావు, బిఎల్ఓ లు తులసి, రజిత, ఆర్పి చంద్రకళ, విజయ నిర్మల , కొమ్మరాజు శ్రీను సాయి చరణ్ స్థానిక వోటర్ లు ప్రజలు పాల్గొన్నారు..

# శివాలయంలో ఆరుద్ర నక్షత్రం, మాస శివరాత్రి పూజలు

**- భక్తులతో కిటకిటలాడిన ఆలయం**

నేరేడుచర్ల జూలై 13 ప్రభాతవార్త :



వంద సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఆరుద్ర నక్షత్రము, మాస శివరాత్రి, సోమవారం కలిసి రావడం పరమశివుడికి అత్యంత ప్రీతికరమని నేరేడుచర్ల లోని అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఆరుద్ర నక్షత్రం వస్తే రుద్రాభిషేకాలు పూజలు చేయడం విశేషమనిఆలయ పూజారి ఉగ్రదండి శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో సాంప్రదాయ సిద్ధంగా భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకాలు ప్రత్యేక అభిషేకాలు చేశారు, అనంతరం విశ్వేశ్వరుని పూలతో, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఊహించని విధంగా అత్యధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ ప్రసాదాలను అందజేశారు, ఆలయ కమిటీ చైర్మన్ రాచకొండ రామకోటేశ్వరరావు భక్తులకు కావలసిన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# దమ్ముచేసిన పొలంలో మొలకెత్తిన వరి విత్తనాలు వెదచల్లాలి

**- మండల వ్యవసాయాధికారి పద్మ**

మేళ్లచెర్వు, జులై 13, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన మేళ్ళచెర్వులో సోమవారం జరిగిన సమావేశములో మండల వ్యవసాయ అధికారి జాటోత్ పద్మ మాట్లాడుతూ రైతులంతా వరినారు పెంచి నాటు వేసేపద్ధతిని నిలుపుదల చేయాలని దమ్ముచేసిన పొలంలో మొలకెత్తిన వరి విత్తనాలను వెదచల్లాలని కోరారు. ఈ వెదచల్లే పద్ధతివల్ల యకరమునకు సుమారు 10వేల రూపాయల ఖర్చు తగ్గుతుందని 10 నుంచి 20 శాతం వరి పంట అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. యకరమునకు పదిహేను కిలోల వరి విత్తనాలను మండే కడితే 24 గంటలలో వరి విత్తనాలు మొలకెత్తుతాయని మొలకెత్తిన వరి విత్తనాలను దమ్ముచేసిన పొలంలో శ్రద్ధగా చల్లాలని కోరారు. విత్తనాలు చల్లేముందు దమ్ము చేసిన పొలంలో నీరు ఎక్కువగా నిల్వలేకుండా చూడాలని కోరారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులను సాధించాలని రసాయనిక ఎరువులు పురుగు మందుల వాడకం తగ్గించాలని వ్యవసాయ శాఖ సలహాలను సూచనలను పాటించాలని కోరారు. ఈ సమావేశములో అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.


# అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు పౌష్టికాహారం..

హుజూర్ నగర్ రూరల్ ,జూలై 13 ,ప్రభాతవార్త:



గ్రామ ప్రజలు అంగన్వాడీ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ యరగాని రాధ నాగరాజు,అంగన్వాడీ సూపర్ వైజర్ రామాదేవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బూరుగడ్డ,లింగగిరి గ్రామాలల్లోని అంగన్వాడీ సెంటర్ లోని పిల్లలకు ఏక రూప దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో గర్భిణీలకు ,బాలింతలకు, చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించబడుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడి కేంద్రాలలో చేర్పించడం వలన పౌష్టిక ఆహారంతో పాటు నాణ్యమైన విద్యను అందించి తల్లిదండ్రుల పై ఆర్థిక భారం లేకుండా ఉంటుందన్నారు. అనంతరం అంగన్వాడి పిల్లలకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఝాన్సీ ,అంగన్వాడీ టీచర్లు కొండ సరిత ,ఉపేంద్రమ్మ ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## హుజూర్ నగర్ వార్త



# ఈనెల 15 నుండి 23 వరకు శ్రీ వారహి గుప్త నవరాత్రుల మహోత్సవాలు

నేరేడుచర్ల జూలై 13 ప్రభాతవార్త :



నేరేడుచర్ల లోని శ్రీ విజయదుర్గ ఆలయంలో ఆషాడ శుక్ల పక్ష పాడ్యమి నుండి ఆషాడ శుక్ల పక్ష నవమి ఈనెల 15 నుండి 23 వరకు శ్రీ వారహి అమ్మవారికి గుప్త నవరాత్రుల మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాటు చేశారు, ఆలయ ప్రధానార్చకులు వెలుగు శ్రీనివాస చార్యులు ఆధ్వర్యంలో ప్రారంభం రోజు ఈనెల 15 న ఉదయం అమ్మవారి దీక్ష తీసుకునే భక్తులకు మాల దారణ ,ప్రతిరోజు సాయంత్రం 7:00 గంటలకు అమ్మవారికి విశేషంగా అభిషేకాలు,పూజాకార్యక్రమాలు అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేయనున్నారు, శ్రీ వారహి అమ్మవారి దీక్ష తీసుకున్న భక్తులకు ఈ 9రోజులు మధ్యాహ్నం బిక్ష దేవాలయం లోనే ఏర్పాటు చేయనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు తెలిపారు,ఎవరైనా భక్తులు ధన,దాన్యారూపంలో సహకరించాలని కోరారు, వారాహి దేవి అమ్మవారి గురించి చరిత్ర లో ఈ విధంగా వివరించారువారాహి దేవి లలితా దేవి సైన్యానికి సర్వసైన్యాధ్యక్షురాలు. ఆమె సప్తమాతృకలలో (ఏడుగురు దైవిక మాతృమూర్తులలో) ఒకరు, ఆమె లక్ష్మీ దేవి స్వరూపంగా కూడా పూజించబడతారు, వరాహ స్వామి (విష్ణువు యొక్క వరాహ అవతారం) యొక్కఅర్ధాంగిగాపరిగణించబడతారు.వారాహి దేవిని శైవులు, వైష్ణవులు శాక్తేయులు సమాన భక్తితో పూజిస్తారు. బౌద్ధమతంలో కూడా, వజ్ర వారాహి మారీచి ఈ దేవత యొక్క స్వరూపాలు లేదా ప్రతిరూపాలుగా చెప్పబడతాయి.మార్కండేయ పురాణంలోని ఖిదేవీ మహాత్మ్యంఖిలో ఉన్న శుంభనిశుంభుల వధ వృత్తాంతం ప్రకారం, పురుష దేవతల శరీరాల నుండి స్త్రీ శక్తి స్వరూపాలు (శక్తులు) ఉద్భవించాయని. శివుని నుండి శివానీ, విష్ణువు నుండి వైష్ణవీ, బ్రహ్మ నుండి బ్రాహ్మణి ఉద్భవించగాఅదే విధంగా వరాహ స్వామి నుండి వారాహి దేవి ఆవిర్భవించారు.ఆమె వరాహ ముఖాన్ని కలిగి ఉండి, చేతుల్లో చక్రం ఖడ్గాన్ని ధరించిప టూ ఉంటారని వర్ణించబడింది. వామన పురాణం మత్స్య పురాణాలలో కూడా వారాహి దేవి ప్రస్తావన కనిపిస్తుంది.ఆషాఢ శుద్ధ పాడ్యమి నుండి ఆషాఢ శుద్ధ నవమి వరకు వారాహి దేవిని రాత్రి వేళల్లో పూజిస్తారు. ఈ తొమ్మిది రాత్రులను ఖిగుప్త నవరాత్రులుఖి (రహస్య నవరాత్రులు) అని పిలుస్తారు,వారాహి దేవి లలితా పరభట్టారిక సైన్యానికి అధిపతి. లలితా దేవికి చెందిన రథాలు, ఏనుగులు, గుర్రాలు పదాతిదళం వంటి సమస్త సైనిక బలగాలు వారాహి దేవి ఆధీనంలోనే ఉంటాయి.అందుకే ఆమెను దండనాథ(సైన్యాధిపతి) అని కూడా పిలుస్తారు.ఆమెకు ఖికిరి చక్రంఖి అనే ప్రత్యేక రథం ఉంది, దీనిని వెయ్యి వరాహాలు లాగుతాయి. ఈ దైవిక రథానికి సారథిగా ఖిస్తంభినీ దేవిఖి వ్యవహరిస్తారు. సమస్త దైవిక శక్తులు ఈ రథంపై ప్రయాణిస్తాయి. ముఖ్యంగా, ఆయుర్వేద పితామహుడైన ధన్వంతరి దేవ వైద్యులైన అశ్విని కుమారులు కూడా వారాహి దేవి రథంలోనే ఉంటారు.వారాహి అమ్మ సాక్షాత్తు భూదేవి స్వరూపమే. హిరణ్యాక్షుడనే రాక్షసుడు భూదేవిని విశ్వ జలాల్లోకి లాక్కొని వెళ్ళినప్పుడు, ఆ రాక్షసుడిని సంహరించి భూదేవిని రక్షించడానికి శ్రీమహావిష్ణువు వరా రూపంలో అవతరించాడు.శ్రీ లక్ష్మీ సహస్రనామ స్తోత్రంలో ఆమెను ఖివరాహి ధరణి ధ్రువఖి (వరాహి రూపంలో ఉన్న స్థిరమైన, చలించని భూమి) అని సంబోధించారు.భక్తులు వరాహిని అనేక దివ్య రూపాలలో ఆరాధిస్తూనే ఉన్నారు ఆయా రూపాలు వారి హృదయపూర్వక ప్రార్థనలను భక్తిని స్వీకరిస్తాయి, స్థానిక శ్రీ విజయ దుర్గ ఆలయంలో ఇటీవలనే ప్రతిష్టించిన శ్రీ వారాహి అమ్మవారికి ప్రప్రదంగా శ్రీ వారాహి గుప్త నవరాత్రుల మహోత్సవాలను ఘనంగా అత్యధిక సంఖ్యలో పాల్గొని మహోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ కోరారు

## చిన్నారులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రీ ప్రైమరీ..

**ఆలేరు, జూలై 13 (ప్రభాతవార్త):**

చిన్నారులకు నాణ్యమైన విద్య అందించడంలో ప్రీప్రైమరీ పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తాయని ఆలేరు మున్సిపల్ వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు అన్నారు. సోమవారం ఆలేరు మున్సిపాలిటీ 6వ వార్డు బహదూర్‌పేట మండల ప్రజా పరిషత్ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రీప్రైమరీ పాఠశాలను ఎంఈఓ లక్ష్మితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ, బహదూర్‌పేటలో ప్రీప్రైమరీ పాఠశాల ఏర్పాటు కోసం కృషి చేసిన ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పిస్తూ, చిన్నారులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. అనంతరం ఎంఈఓ లక్ష్మి ్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మమతతో కలిసి



చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు విద్యా సామగ్రిని అందజేసి, వారి ఉజ్వల భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లత, అంగిడి అరుణ, స్వప్న, అంగన్వాడి టీచర్ విజయలక్ష్మి, బిఆర్ఎస్ పార్టీ సెక్రటరీ జనరల్ కుండె సంపత్ , వట్టిపల్లి సిద్దిరాజు, లక్ష్మణ్, శ్రీరాములు, మల్లయ్య, కుమార్, పవన్, వినయ్, జంపాల అంజయ్య పాల్గొన్నారు.





## విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

**మోటకొండూర్, జూలై 13, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల, పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 3947 విద్యార్థులు ఉండగా అందులో 3564 విద్యార్థులకు నులి పురుగుల నివారణ ప్రాధాన్యతను వివరించి ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. మాత్రలు తీసుకోని విద్యార్థులందరికీ ఈ నెల 20వ తేదీన నిర్వహించే మాప్‌అప్ డే సందర్భంగా తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకటి నుండి 19 సంవత్సరాల స్కూల్ కు వెళ్ళని విద్యార్థులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కట్ట విజయ్, ఎం ఈ ఓ రఘురాంరెడ్డి, సర్పంచ్ భూమండ్ల జయమ్మ శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్ లు నాయకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లు, వైద్య సిబ్బంది డాక్టర్ హారిక, హెచ్ ఈ ఓ నరసింహ, శ్రీనివాస్, పి హెచ్ ఎన్ స్లీవమ్మ, హెచ్ ఎస్ సుగుణ, అంజుమ్, ఎం.ఎల్.హెచ్.పి పార్వతమ్మ, ఆరోగ్య కార్యకర్తలు సైదులు, ధనమ్మ, విజయరాణి, సుభాషిని, అరుణ, పద్మావతి, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

## బీఎల్‌ఏలు అప్రమత్తంగా పనిచేయాలి: గొంగిడి సునీత మహేందర్ రెడ్డి

**రాజాపేట, జూలై 13 ప్రభాతవార్త:**

ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) కీలక పాత్ర పోషించాలని ఆలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి అన్నారు. సోమవారం రాజాపేటలో నిర్వహించిన బీఎల్‌ఏల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన వారందరి పేర్లు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చూడాలని సూచించారు. ఓటరు జాబితాలో పొరపాట్లు, నకిలీ నమోదులు, అనర్హుల పేర్లు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ఒక వ్యక్తి పేరు రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఓటరుగా నమోదై ఉండడం చట్టవిరుద్ధమని, అలాంటి అంశాలపై ఎన్నికల అధికారులు కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ఒకే చోట మాత్రమే ఓటరుగా నమోదు చేసుకోవాలని, చట్టాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రతి 20 సంవత్సరాలకు ఒకసారి జరిగే ప్రత్యేక ఓటరు జాబితా సవరణను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, అర్హులైన కొత్త ఓటర్లను నమోదు చేయడంతో పాటు అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులను సకాలంలో పూర్తి చేయాలని బీఎల్‌ఏలకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల్ అధ్యక్షుడు సటు తిరుమలేష్, మదర్ డైరీ డైరెక్టర్ సంధిల భాస్కర్



గౌడ్, మాజీ సర్పంచ్ల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, జలసాధన సమితి కన్వీనర్ ఎర్రగోకుల జశ్వంత్, బిఆర్ఎస్ మండల పార్టీ ఉపాధ్యక్షులు బేగంపేట మాజీ ఎంపీటీసీ బోగ హరినాథ్, రఘునాథపురం సర్పంచి పల్లె సంతోష్, బూరుగుపల్లి సర్పంచ్ చింతల సంపత్, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుర్రం నర్సిములు, బూర్గు నర్సిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మొలుగు సోమలింగం, మాజీ సర్పంచి కర్ల కర్ణాకర్ రెడ్డి, రెడ్డబోయిన రాజు, ఆదర్శ రైతు మేక వెంకటేశ్వర రెడ్డి, చెరుకు కనకయ్య, సామల రమేష్ సత్యనారాయణ రెడ్డి, నర్సాపురం మాజీ సర్పంచ్ నాగిర్తి గోపి, బిళ్ళ కుదురు రాజు, వేముల సంపత్ , రాజపేట మండల సోషల్ మీడియా కన్వీనర్ గంధమల్ల సురేష్, లక్ష్మయ్య, రవి, నీల బిక్షపతి, బాలకృష్ణ కట్కూరి రమేష్ నాయకులు, బీఎల్‌ఏలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**యాదగిరి గుట్ట జులై 14, (ప్రభాతవార్త):**



యాదగిరిగుట్టశ్రీ లక్ష్మి ్ర నరసింహ స్వామి దేవస్థానం ధర్మకర్త పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ పై ఇటీవల సోషల్ మీడియాలో అనుచిత ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతూ పోస్ట్ చేసిన వ్యక్తి పై చర్యలు తెసుకోవాలని మాజీ కౌన్సిలర్ అనిల్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లో కీ వెళితే... యాదగిరిగుట్ట దేవస్థానం ధర్మకర్తగా ఇటీవల ప్రమాణస్వీకారం చేసిన పోచబోయిన ఈశ్వరమ్మా యాదవ్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియా లో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్బీనగర్ నియోజకవర్గం చెందిన జక్కిడి శివచరణ్ రెడ్డి అనే వ్యక్తి అసత్య పదజాలాలు వాడుతూ ఆమెకున్న గౌరవంతో పాటు యావత్తు యాదవుల మనోభావాలను దెబ్బ తినేలా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా అతని మాటలు ఉన్నాయని అనిల్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమం వేదికగా అతను దూషణపర్వం చేసినందున అతని పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ లో మాజీ కౌన్సిలర్ అనిల్ కుమార్ యాదవ్ ఫిర్యాదు చేశారు.

## ఘనంగా మాస శివరాత్రి వేడుకలు.....

### - మహా శైవాక్షయోగం సందర్భంగా అభిషేకాలు.....

**రాజాపేట జూలై 13 ప్రభాతవార్త:**


అతి పవిత్రమైన 100 సంవత్సరాలకు ఒకసారి వచ్చే మహాశైవాక్షయోగం మాస శివరాత్రి ప్రత్యేకమైన రోజు పరమశివుడికి ఇష్టమైన సోమవారం రోజు రాజపేట శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో శ్రీ స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయానికి వచ్చిన భక్తులు త్రిదల బిల్వం తో శ్రీ స్వామివారికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద శర్మ ఆధ్వర్యంలో ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షులు నంగునూరు చంద్రశేఖర్ పర్యవేక్షణలో పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్



శర్మ మాస శివరాత్రి విశిష్టతను వివరించారు. రాజాపేట పిఎసిఎస్ చైర్మన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్ భాగ్య లక్ష్మి పుణ్య దంపతులు కుమారుడు సాయి మనోజ్ కుమార్, రాజపేట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు ఉప్పల రమేష్, ఉప్పల మనీష్ కుమార్ లు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలోని అనుబంధాలయమైన పర్వత వర్ధిని శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో శివంగిలింగానికి నారికేల జల అభిషేకం, స్ఫటిక లింగ దర్శనం శివ కుటుంబ దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా శివాలయంలో అర్చక స్వాములు గోత్రనామార్చనలతో ప్రత్యేక పూజలు చేశారు తీర్థ ప్రసాద వితరణ వేద ఆశీర్వచనం జరిగింది. అనంతరం శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి స్వయంభువుల దర్శనం చేసుకున్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**తుర్కపల్లి, జూలై 13 ప్రభాతవార్త:** తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన గ్రామపంచాయతీ సిబ్బంది గా విధులు నిర్వహిస్తున్న ఈదులకంటి పోచమ్మ భర్త రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా సోమవారం ఉప సర్పంచ్ పల్లె నరేష్ గౌడ్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కోట జాన్సన్, రాజు, ఆంజనేయులు, గ్రామపంచాయతీ సిబ్బంది తలారి మాధవి, కోట లావణ్య, బిచ్చల సుశీల, లక్ష్మి ్ర, పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా ప్రీ ప్రైమరీ తరగతుల ప్రారంభం

**తుర్కపల్లి ,జూలై 13 ప్రభాతవార్త:** తుర్కపల్లి మండల కేంద్రంలోని



ఎంపీపీ ఎస్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ప్రీ ప్రైమరి తరగతులను గ్రామ సర్పంచ్ సోమల వెంకటేశం, ఉపసర్పంచ్ పల్లె నరేష్ గౌడ్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆహ్వానం పలికి పాఠశాలలో విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు చిన్నారుల సమగ్ర వికాసానికి ప్రీ ప్రైమరి విద్య ఎంతో కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లెంకల గీతారెడ్డి , మండల విద్యాధికారి మంజూషారాణి ,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాంపల్లి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ, ఉపాధ్యాయులు రాధిక ,మీనా దేవి, రజియా సుల్తానా, విద్యా కమిటీ సభ్యులు, ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ భాగ్యలక్ష్మి ్ర, ఆయా లక్ష్మి ్ర, గ్రామస్తులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పిఏసిఎస్ పాలకవర్గాన్ని సన్మానించిన మాజీ సర్పంచ్

**తుర్కపల్లి ,జూలై 13 ప్రభాతవార్త :** తుర్కపల్లి మండల కేంద్రంలోని పిఏసిఎస్ కార్యాలయంలో నూతన పాలకవర్గాన్ని పల్లె పహాడ్ మాజీ సర్పంచ్ సోక్కుల మోహన్ రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకవర్గం సభ్యులు రైతులకు అందుబాటులో ఉండి రైతుల సంక్షేమ ,అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. ఈ పిఏసిఎస్ చైర్మన్ ధనావత్ శంకర్ నాయక్, డైరెక్టర్లు పాముల రాజు, మోత్కుపల్లి రవి, బానోతు వినోద్, జాగిల్లపురం సతీష్, గుగులోతు హనుమంతు నాయక్, పనగట్ల సుదర్శన్ గౌడ్, ఒగ్గు బిక్షపతి ,వంగ నారాయణరెడ్డి, సడల లతా, రామ గొని మహేష్ కుమార్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి ,సర్పంచులు సోముల వెంకటేశం పాల్గొన్నారు.

## విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ

**తిరుమలగిరి జూలై 13 ప్రభాతవార్త.**

తిరుమలగిరి మండలంలోని వెలిశాల గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని వెలిశాల గ్రామ సర్పంచ్ కుంభం మంజుల సతీష్ గౌడ్ ప్రారంభించి, విద్యార్థులు పరిశుభ్రతను పాటిస్తూ నులిపురుగుల నివారణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది విద్యార్థులకు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించి, డీవార్మింగ్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ



కార్యక్రమంలో ఏఎన్ఎం ఆశా వర్కర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ సిబ్బంది, విద్యార్థినీ-విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

**తిరుమలగిరి జూలై 13 ప్రభాతవార్త.**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమం సందర్భంగా మహాత్మ గాంధీ జ్యోతి రావు పూలే బాలుర హై స్కూల్తిరుమలగిరి లో వైద్యాధికారి డా.యం.వందన విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్ర తగురించి మరియు ఆల్బెండజోల్ గోలీల ఉపయోగాల గురించి అవగాహన కల్పించి ఆల్బెండజోల్ టాబ్లెట్ వేయడం జరిగినది. ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల వరకు ప్రతి ఒక్క పిల్లలు మింగాలినీ ఇదే విధంగా రెండు సంవత్సరాల లోపు పిల్లలకు సగం టాబ్లెట్, రెండు సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల వరకు పూర్తి టాబ్లెట్ వేసుకోవచ్చు అని ఆమె అన్నారు టాబ్లెట్ ఈ టాబ్లెట్లు నమిలి మింగాలిని తెలియజేశారు ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సునీత, సూపర్ వైజార్స్ స్వరూప కుమారి, రామచంద్ర, హెల్త్ అసిస్టెంట్స్ నర్సింహ రెడ్డి,విజయ్ రమాదేవి, ఆశలు మాధవి, యాకలక్ష్మి పాల్గొన్నారు

## ముఖ్యమంత్రి మాటలను తీవ్రంగా ఖండిస్తున్నా

**తుంగతుర్తి. జూలై 13.ప్రభాతవార్త.**

రైతులను ఏ విధంగా ఆదుకుంటారు అని ఒక విలేఖరి అడిగిన ప్రశ్న కు సమాధానం చెప్పిన ముఖ్యమంత్రి ఏముంది వాళ్లను కోసి రక్తం వెదజల్లితే పంటలు పండుతాయి అని మా బి ఆర్ ఎస్ పార్టీ నాయకుల్లైన మ్లా హరీష్ రావు జగదీష్ రెడ్డి లను ఉద్దేశించి మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బి.ఆర్.ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఒక బాధ్యతమైన ముఖ్యమంత్రి పదవిలో ఉన్నవ్యక్తి ఆవిధంగా రెచ్చగొట్టే మాటలు మాట్లాడడం ఆక్షేపణీయం. ఇలాంటి మాటలు సామాన్య కార్యకర్త కూడా మాట్లాడరని అన్నారు.అలాంటిది కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి. రైతులను ఆదుకోవడానికి ఆలోచన చేస్తాం చెప్పేది పోయి ఫ్రస్టేషన్ లో ఉన్న వ్యక్తి లాగ అలాంటి హింసాత్మక మాటలు మాట్లాడితే ప్రజలు



తిరగబడతారని అన్నారు. త్వరలో మీకు మీ పార్టీకి తగిన గుణ పాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఇకనైన కండ్లు తెరిచి ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేసే ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు గ్రూపులుగా తన్నులాటలు. గుద్దులాటలు చేసుకుంటున్న మీరు మ్మా మ్లా. హరీష్. జగదీష్ రెడ్డి లను తిట్టడం మానుకోవాలని హెచ్చరించారు సమావేశం లో జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్ పాల్గొన్నారు

## బైండోవర్ ఉల్లంఘన.. రెండు నెలల జైలు

**మోతె, జూలై 13 ప్రభాత వార్త.**

..బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి రెండు నెలల జైలు శిక్ష విధించారు. మండలంలోని రాఘవపురం గ్రామానికి చెందిన పాలకూరి సాయికృష్ణ (29) గతంలో భూ వివాదానికి సంబంధించిన కేసులో నిందితుడిగా ఉండటంతో సత్ప్రవర్తన కోసం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ బి. లచ్చిరెడ్డి తెలిపారు. అయితే బైండోవర్ నిబంధనలను ఉల్లంఘిస్తూ మరో నేరానికి పాల్పడడంతో తహసీల్దార్ నోటీసులు జారీ చేసినప్పటికీ ఆయన స్పందించలేదన్నారు. దీంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు సోమవారం సాయికృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం నల్గొండ జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ బి. లచ్చిరెడ్డి హెచ్చరించారు.

## భారత ఓటర్ సమగ్ర సర్వే పై సంస్కృతిక సారధులచే కళా ప్రదర్శన

**తుంగతుర్తి. జూలై 13. ప్రభాతవార్త**

సర్ ప్రక్రియకు ప్రతి ఒక్కరు సహకరించాలని సాంస్కృతిక సారధి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి శ్రీకాంత్ అన్నారు. సోమవారం మండలం పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో నిర్వహించిన ఓటర్ జాబితా ప్రక్షాళన పై నిర్వహించిన కళా ప్రదర్శనలు పాల్గొని మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియను చేపట్టిందని అన్నారు.తెలంగాణలో దీనికి సంబంధించిన సర్వే ఎన్యుమరేషన్ ప్రక్రియ జూన్ 25 నుండి ప్రారంభమైంది. ఈ ప్రక్రియ ద్వారా నకిలీ, మరణించిన ,అర్హత లేని ఓటర్లను తొలగించడం దీని ముఖ్య ఉద్దేశం అని అన్నారు కొత్తగా ఓటు నమోదు చేసుకునేవారు, యువతి, యువకులు తమ తల్లిదండ్రుల వివరాలను కచ్చితంగా అందించవలసి ఉంటుంది. ఈ వివరాలు ఇస్తేనే కొత్త ఓటు నమోదు అవుతుందని అన్నారు. బి ఎల్ ఓ అధికారులు ప్రతి ఇంటికి వచ్చి ఫారాలు సేకరిస్తారు అని కళ ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ శ్రీకాంత్. తెలంగాణ సాంస్కృతిక సారధి టీం లీడర్ గంటా బిక్షపతి, సాంస్కృతిక సారధి కళాకారు గడ్డం ఉదయ్,వల్లెల లక్ష్మణ్,వల్లెల రాము, పాక ఉపేందర్,మద్దిరాల మంజుల, కుందమల్ల నాగలక్ష్మి,ములకలపల్లి మల్లమ్మ, నేమ్మది స్రవంతి,గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**మోతె, జూలై 13 ప్రభాత వార్త.**



..మండలం లోని నామవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు దైద యల్లయ్య ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు అండగా నిలిచారు. సోమవారం నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్రెడ్డి హాజరై యల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ కమిటీ సహకారంతో సేకరించిన రూ.56 వేల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. కష్టకాలంలో యల్లయ్య కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా ముందుకొచ్చి కుటుంబానికి చేయూత అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి పాడి గేదె మృతి

**జాజిరెడ్డిగూడెం, జులై 13 (ప్రభాత వార్త):**

జాజిరెడ్డిగూడెం మండలంలోని వెల్పుచర్ల గ్రామానికి చెందిన రైతు ఉగ్గం సంతోష్కు చెందిన పాడి గేదె సోమవారం మేతకు వెళ్లిన సమయంలో తెగిపడిన విద్యుత్ ఎల్టీ లైన్ తీగలు తగిలి మృతి చెందింది. ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రవహిస్తున్న తీగలు తగలడంతో గేదె అక్కడికక్కడే చనిపోయింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.40 వేల ఉంటుందని రైతు తెలిపారు. ఈ ఘటనతో తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని, విద్యుత్ శాఖ అధికారులు సంఘటనను పరిశీలించి ప్రభుత్వం తరఫున తగిన నష్టపరిహారం మంజూరు చేసి ఆదుకోవాలని రైతు ఉగ్గం సంతోష్ కోరారు.




## నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ పంపిణీ



**జాజిరెడ్డిగూడెం, జులై 13 (ప్రభాత వార్త):**

అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 2,410 మంది పిల్లలను గుర్తించగా, 2,276 మంది (94.43 శాతం) చిన్నారులకు ఆల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల మాత్రలను పంపిణీ చేశారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు అర మాత్ర, రెండు నుంచి 19 సంవత్సరాల పిల్లలకు పూర్తి మాత్ర అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ భూక్య నగేష్ నాయక్ మాట్లాడుతూ నులిపురుగుల నివారణకు పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం, మలవిసర్జన అనంతరం, భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవడం ద్వారా నులిపురుగుల బారిన పడకుండా నివారించవచ్చని సూచించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చు నాయక్, హెల్త్ సూపర్వైజర్లు లలిత, వీరయ్య, సైదమ్మ, శకుంతల, హెడ్మాస్టర్లు మల్లేష్, పురుషోత్తం, విమలకుమారి, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

## తిరుమలగిరి ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**తిరుమలగిరి జూలై 13 ప్రభాతవార్త.**

తిరుమలగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (గవిలీలి) ఆధ్వర్యంలో 10వ తరగతి మరియు ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కన్వీనర్ దామెర శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 27 లోపు ఆన్లైన్ ద్వారా గాని నేరుగా కానీ తమ దరఖాస్తులను సమర్పించాలని ఆయన కోరారు. ఉద్యోగులు, చదువు మధ్యలో మానేసిన వారు, అలాగే తమ విద్యను కొనసాగించాలనుకునే వారికి ఇది మంచి అవకాశమని తెలిపారు. మరిన్ని వివరాలకు:అసిస్టెంట్ కన్వీనర్ జిల్లేపల్లి జానయ్య 09550398658ను సంప్రదించవలసినదిగా తెలిపారు.

## ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ

**మోతె, జూలై 13 ప్రభాత వార్త..**



. నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల వైద్యాధికారి భవాని అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగుల సమస్య వల్ల శారీరక, మానసిక ఎదుగుదల మందగించే అవకాశం ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేసి వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సందీప్ కుమార్, ఎంఈఓ కె. గోపాలరావు, పీహెచ్ఎన్ జయలక్ష్మి, సూపర్వైజర్ పద్మ, నాగలక్ష్మి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్రమంగా పశువుల తరలింపువాహనం పట్టివేత

**9 పశువులు స్వాధీనం**

**చౌటుప్పల్, జులై 13 జులై 13, ప్రభాతవార్త :** అక్రమంగా పశువులను తరలిస్తున్న ఒక వాహనాన్ని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. చౌటుప్పల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ సీతారాం రెడ్డిలు పెట్రో మొబైల్1 వాహనంలో విధుల్లో ఉన్నారు. ఈ క్రమంలో వలిగొండ రోడ్డు మార్గంలో అక్రమంగా పశువులను తరలిస్తున్నారనే నమ్మదగిన సమాచారం రావడంతో పోలీసులు అక్కడ వాహనాల తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా వచ్చిన టాటా ఇన్ట్రా వీ 30 వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, అందులో ఎలాంటి అనుమతులు లేకుండా క్రూరంగా తరలిస్తున్న 9 పశువులు (4 ఎద్దులు, 5 ఆవులు) లభ్యమయ్యాయి. వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్‌ను సూర్యాపేట జిల్లా కోదాడ టౌన్‌కు చెందిన షేక్ యాకూబ్ (32) గుర్తించారు. నిందితుడిని



విచారించగా.. ఈ పశువులను కోదాడ సంతలో కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు అంగీకరించాడు. పట్టుబడిన 9 పశువులను జఫర్ గూడలోని భీగో మహాక్షేత్రంభి గోశాలకు సురక్షితంగా తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.




## అర్హత ను బట్టి అర్హులైన వారిని సిసి లు గా నియమించాలి

**తిరుమలగిరి సాగర్ జులై 13, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ని మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద మండల పరిధిలోని అందరూ వి ఓ ఏ లు సోమవారం ధర్నా కి దిగారు విఓఏ ల అధ్యక్షురాలు ఉయ్యాల అజిత మాట్లాడుతూ గ్రామ సంఘాలను బలోపేతం చేస్తున్న గ్రామ ఆర్గనైజింగ్ అసిస్టెంట్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ప్రతి గ్రామ సంఘానికి ట్యాబు నెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ల సాధన కొరకు ఉద్యోగ భద్రత తో పాటు, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ట్యాబ్ సౌకర్యం కల్పించడంతోపాటు ..20 లక్షల ప్రమాద బీమా పథకాన్ని వర్తింపచేయాలన్నారు. విద్యా అర్హత ను బట్టి అర్హులైన వారిని సిసిలుగా నియమించాలన్నారు. ముదు నెలలకోసారి వి ఓ ఏ రెన్యూవల్ పద్ధతిని తీసివేయాలి అన్నారు ఈ కార్యక్రమంలో వి ఓ లు వర్దపాక కలమ్మ మీక్య లాలు నాయక్ బాలకృష్ణ పట్నాయక్ నాగేశ్వర్ రావు కవిత సంగీత ఈశ్వరమ్మ ధనమ్మ శ్రీలక్ష్మి ప్రభావతి కోటమ్మ తదితరులున్నారు.

# ముమ్మరంగా నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

**చౌటుప్పల్, జులై 13 ప్రభాతవా ర్త**



పిల్లల ఆరోగ్యమే దేశానికి శ్రీరామరక్ష అని, వారి శారీరక, మానసిక ఎదుగుదలకు నులి పురుగుల నివారణ ఎంతో కీలకమని మున్సిపల్ చైర్పర్స న్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక కస్తూరిబా ప్రభుత్వ బాలికల విద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆమె స్వయంగా నులి పురుగుల నివారణ మాత్రలను (అల్బెండజోల్) వేశారు. ఈ సందర్భంగా చైర్పర్స న్ పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ పిల్లల కడుపులో నులి పురుగులు చేరడం వల్ల వారు రక్తహీనత, పోషకాహార లోపానికి గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది వారి శారీరక, మానసిక ఎదుగుదలను తీవ్రంగా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యకరమైన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ ఆల్బెండజోల్ మాత్రలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పిల్లల్లో వ్యక్తిగత పరిశుభ్రత అత్యంత ప్రధానమని చైర్పర్స న్ స్పష్టం చేశారు. భోజనానికి ముందు, భోజనం తర్వాత, అలాగే మలవిసర్జన అనంతరం చేతులను, కాళ్లను సబ్బుతో శుభ్రంగా కడుక్కునే అలవాటును చిన్నతనం నుంచే నేర్పించాలన్నారు. ఈ చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే 90 శాతం మంది పిల్లలు ఎలాంటి రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని ఆమె తెలియజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ సుమన్ కళ్యాణ్ మాట్లాడుతూ విద్యార్థినులకు నులి పురుగుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొగుదాల రమేష్ గౌడ్, స్థానిక వార్డ్ కౌన్సిలర్ పాక చిరంజీవి, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ భవాని, స్థానిక ఆరోగ్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## జాజిరెడ్డిగూడెం ఎస్‌బిఐ మేనేజర్‌గా రమేష్ బాధ్యతల స్వీకరన

**జాజిరెడ్డిగూడెం, జులై 13 (ప్రభాత వార్త):** జాజిరెడ్డిగూడెం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) శాఖ నూతన మేనేజర్‌గా సోమవారం జి. రమేష్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన జనగామ ఎస్‌బిఐ శాఖ నుంచి బదిలీపై జాజిరెడ్డిగూడెం శాఖకు వచ్చారు. ఇక్కడ



మేనేజర్‌గా పనిచేసిన రామకృష్ణ ఖమ్మం జిల్లాకు బదిలీ కావడంతో జి. రమేష్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఖాతాదారులకు వేగవంతమైన, నాణ్యమైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు కృషి చేస్తానని జి. రమేష్ తెలిపారు.

## నులిపురుగుల నివారణకు మందుల పంపిణి

**మాడుగులపల్లి, జులై 13 ప్రభాత వార్త** జాతీయ నులిపురుగుల దినోత్సవం నాడు, (నేషనల్ డివార్మింగ్ డే ) పిల్లల పేగు లలో ఉండే నులి పురుగుల ( నట్టల ) నిర్మూలనకు,వారి ఆరోగ్యానికి, ఎదుగుదలలో, ఏటా రెండు సార్లు, 1నుంచి 15 సంవత్సరాల లోపు, అల్బండజోలు మాత్రలను సర్పంచ్ ఆరూరి నరేష్ తో కలిసి విద్యార్థులకు అందచేసి న, మండల విద్యాధికారిని సీ ఎచ్ వెంకటమ్మ. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, ముఖ్యంగా విద్యార్థినిలు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని, వాష్ ఏరియాలలో చెప్పులు ధరించి నడవాలని,



ఎప్పటికప్పుడు గోర్లు కత్తిరించు కోవాలని విద్యార్థినిలకు సూచించారు కార్యక్రమంలో,పాఠశాల ఎస్ ఓ సునీత, ఉప సర్పంచ్ మల్లె పల్లి వెంకన్న,ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయినిలు తదితరులున్నారు.

## పాము కాటుతో కార్మికుడు మృతి

**చౌటుప్పల్, జులై 13 13 (ప్రభాత వార్త):** మండలంలోని కొయ్యలగూడెం గ్రామ సమీపంలో ఉన్న ప్రతిభ బయోటెక్ కంపెనీలో సెంట్రింగ్ పని ముగించుకుని తిరిగి వస్తుండగా ఈనెల 11వ తేదీన పాము కాటుకు గురి కావడంతో వెంటనే హైదరాబాద్ లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారంం.. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మూడు చింతలపల్లి మండలం లింగాపూర్ తండాకు చెందిన ధీరావత్ స్వామి (34) అనే కార్మికుడు కొయ్యలగూడెంలోని ప్రతిభ బయోటెక్ కంపెనీలో సెంట్రింగ్ పని చేస్తున్నాడు. ఈ నెల 11న రాత్రి 7 గంటల ప్రాంతంలో పని ముగించుకుని కొయ్యలగూడెం బస్ స్టాప్ వైపు నడుచుకుంటూ వస్తుండగా శివారు ప్రాంతంలో స్వామి ఎడమ కాలు పాదానికి పాము కరిచింది. వెంటనే సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతడిని హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం స్వామి మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి. రవీందర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు

## నులిపురుగుల నివారణకు ఆల్బండా జోలే మాత్రలు వాడాలి

**మిర్యాలగూడ, జులై 13 ప్రభాతవార్త** చిన్నారుల ఎదుగుదలను ఆటంక పరిచే నులిపురుగుల నివారణకు ప్రతీ ఒక్క చిన్నారి కి ఆల్బెండజోల్ మాత్రలు అందజేయాలనీ మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుదా బాలకృష్ణ అన్నారు. సోమవారం 31వ వార్డు ఉర్దూ మీడియం పాఠశాల, మాడిసన్ పబ్లిక్ స్కూల్ లో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసి మాట్లాడారు. వర్షాకాలంలో వచ్చే నట్టల పురుగుల నివారణ ఆరోగ్య సంరక్షణలో భాగంగా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నా నట్టల గోలీలు ప్రతి చిన్నారికి తప్పనిసరిగ అందించాలన్నారు. అదేవిదంగా పిల్లలు పరిశుభ్రత పాటించాలని, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, స్వచ్ఛమైన తాగునీరు తాగడం, పోషకాహారం తీసుకోవాలని కోరారు.

### రహదారిపై గుంతలు పూడ్చివేత

**దుమ్ముగూడెం ప్రభాతవార్త :** దుమ్ముగూడెం మండలం పెద్దనల్లబెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దనల్లబెల్లి గ్రామం లో ప్రధాన రహదారిపై ఏర్పడ్డ గుంతలను సర్పంచ్ మడకం సారక్క ఆధ్వర్యంలో గ్రావెల్ తో పూడ్చివేశారు గత కొంతకాలంగా పెద్దనల్లబెల్లి గ్రామంలో ఇబ్బందులు పడుతున్నారు రాత్రి సమయంలో అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి

## చేనేత కార్మికులకు పని కల్పించే ధ్యేయంగా పనిచేస్తాం

**రామన్నపేట, జులై 13 ప్రభాతవార్త** కార్మికులకు చేతినిండా పని కల్పించే విధంగా నూతన కార్యవర్గం పనిచేస్తుందని జనంపల్లి వెంకటరమణ చేనేత సహకార సంఘం అధ్యక్షులు వనం శ్రీనివాస్ అన్నారు. సోమవారం చేనేత సహకార సంఘం ప్రమాణ స్వీకారోత్స వ కార్యక్రమం ఎన్నికల అధికారి తరుణ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత సహకార సంఘం నూతన అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ చేనేత కార్మికులందరూ ఐక్యంగా ఉండాలని సంఘ బలోపేతానికి కృషి చేయాలని ఆయన కోరారు. సంఘం ఉపాధ్యక్షులు ఎక్కలదేవి నరసింహా, కార్యదర్శి సంగిశెట్టి గోవర్ధన్, కోశాధికారి కైరంకొండ సరిత, డైరెక్టర్లు సంగిశెట్టి ధనుంజయ, సంగిశెట్టి బిక్షం, కర్నాటి నరసింహా, కైరంకొండ శ్రవణ్ కుమార్, సంగిశెట్టి అనిత లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బండ సరోజ అంజిరెడ్డి,చేనేత వృత్తిదారులు, కార్మికులు, పద్మశాలీలు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.



## నులిపురుగుల నివారణ మాత్రల పంపిణి

**సంస్థాన్ నారాయణపురం, జులై 13(ప్రభాత వార్త):** మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేరి ననులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి మండల వైద్యాధికారి డాక్టర్ రవినా తో కలిసి సోమవారం ప్రారంభించారు. జిల్లా పరిషత్( బాలుర) ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేసి అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ చిన్నారులు ఆల్బెండజోల్ మాత్రలు తప్పని సరిగా వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ,12వ వార్డు సభ్యులు సింగపంగా ప్రశాంతి రమేష్, గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు ఎర్రోళ్ల లింగస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బద్దం గిరి, ప్రిన్సిపల్ రమాదేవి, ఏఎన్ఎంలు స్కూల్ టీచర్లు,ఆశ వర్కర్లు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించడమే ప్రతి పోలీసు అధికారి లక్ష్యం

- యాదాద్రి జోన్‌జు డీఐజీ డి.జోయెల్ డేవిస్
- శాంతిభద్రతల విషయంలో రాజీ లేదు
- నేర నియంత్రణకు ముందస్తు చర్యలే విజయానికి మూలం..
- ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి శాస్త్రీయ ఆధారాలతో విచారణ చేపట్టాలి...
- నల్లగొండ జిల్లా పోలీసు శాఖ పనితీరు ప్రశంసనీయం
- ఇదే అంకితభావంతో సేవలు కొనసాగించాలి..




నల్గొండ .ప్రతినిధి. ప్రభాతవార్త జూలై 13: యాదాద్రి జోన్‌జు డి.ఐ.జి, డి.జోయెల్ డేవిస్ సోమవారం నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించి జిల్లా పోలీసు అధికారులతో సమగ్ర నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్, జిల్లాలోని భౌగోళిక పరిస్థితులు, శాంతిభద్రతల పరిస్థితి, నేరాల ధోరణి, పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, బందోబస్తు నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్, ప్రజలకు అందిస్తున్న సేవలు, పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై సమగ్ర ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా డీఐజీ డి. జోయెల్ డేవిస్, మాట్లాడుతూ, నల్లగొండ జిల్లా పోలీసు శాఖ పనితీరు అత్యుత్తమంగా ఉందని అభినందించారు. ఇదే క్రమశిక్షణ, అంకితభావం, ప్రజాసేవా దృక్పథంతో ప్రతి అధికారి విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన, వేగవంతమైన పోలీసు సేవలు అందించడం ప్రతి పోలీసు అధికారి ప్రధాన లక్ష్యంగా ఉండాలని, ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే విధంగా వ్యవహరించాలని అన్నారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేస్తూ, ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణే పోలీసు శాఖ అత్యున్నత బాధ్యత అని పేర్కొన్నారు. నేరాలు జరిగిన తరువాత స్పందించడం కంటే అవి జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే సమర్థవంతమైన పోలీసింగ్ అని చెప్పారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలకు దారితీసే పరిస్థితులను ముందుగానే గుర్తించి, సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో విలేజ్ పోలీస్ వ్యవస్థ ద్వారా ప్రజలతో నిరంతరం మమేకమై స్థానిక సమస్యలు, వివాదాలు, అనుమానాస్పద కదలికలపై ముందస్తు సమాచారం సేకరించి నేరాలను ప్రారంభ దశలోనే అరికట్టాలని ఆదేశించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. రౌడీషీటర్లు, బైండోవర్ వ్యక్తులు, పాత నేరస్తులు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులు, అసాంఘిక శక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని, నైట్ పెట్రోలింగ్, నాకాబందీలు, కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు, వాహన తనిఖీలు మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. సున్నిత ప్రాంతాల్లో ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నల్లగొండ జిల్లా అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఇతర నేర కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇంటెలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేస్తూ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ప్రస్తుతం వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ చెల్లింపుల భద్రత, సోషల్ మీడియా నేరాలపై గ్రామాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా ట్రాఫిక్ అవగాహన, రోడ్డు భద్రత, మహిళల భద్రత అంశాలపై నిరంతర ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనల అమలులో ఎలాంటి రాజీ పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ఎస్‌హెచ్‌ఓ ఒక సమర్థవంతమైన నాయకుడిగా తన పోలీస్ స్టేషన్‌కు దిశానిర్దేశం చేస్తూ, సిబ్బందిని సమన్వయం చేసుకొని నేర నియంత్రణలో తనదైన ముద్ర వేయాలని డీఐజీ సూచించారు. పారదర్శకత, జవాబుదారీతనం, క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ, భవిష్యత్ పోలీసింగ్ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్పీ జిల్లా డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్‌ఓలతో సమావేశమై వారి పోలీస్ స్టేషన్ల పరిధిలోని నేరాల పరిస్థితి, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, శాంతిభద్రతల నిర్వహణ, కమ్యూనిటీ పోలీసింగ్, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, ఎస్‌బీ డీఎస్పీ మల్లారెడ్డి, నల్లగొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి, దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, డీటీసీ డీఎస్పీ నగేష్, సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ, ఏ.ఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, జిల్లా సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కట్టంగూర్‌లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం..

కట్టంగూర్, జూలై 13, ప్రభాతవార్త: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కట్టంగూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, గ్రామాల్లోని విద్యార్థులకు మండల వైద్య సిబ్బంది ఉచితంగా అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ జమున మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనతను నివారించడంతో పాటు వారి శారీరక, మానసిక ఎదుగుదలకు నులిపురుగుల నివారణ ఎంతో కీలకమని తెలిపారు. అల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం వల్ల కడుపులోని నులిపురుగులు నశించి, పోషకాహార లోపం తగ్గడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలోని ప్రతి విద్యార్థికి మాత్రలు అందేలా వైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల వైద్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పొన్నోజు గణేష్ కుటుంబానికి తోటి స్నేహితుల సాయం



రాజాపేట జూలై 13 ప్రభాతవార్త : రాజాపేట మండలం నర్సాపురం గ్రామానికి చెందిన పొన్నోజు గణేష్ ఇటీవల మరణించగా గణేష్ కూతురు పేరున స్నేహితులు పెద్దలు, 10వ, తరగతి, ఇంటర్ స్నేహితులు కలిసి 57,100 రూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్ అందజేశారు.

# పరమేశా గంగవిడము......

- వానల కోసం సామూహిక జాలాభిషేకాలు....



రాజాపేట, జులై 13 ప్రభాతవార్త: రాజాపేట మండలం మొల్లగూడెం లో మహిళలు, మహిళా ప్రతినిధులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. శివుడికి ప్రీతికరమైన రోజు కావడంతో స్వామి వారిని వేడుకుంటూ మహిళలు ఖిఖిగంగవిడము పరమేశా ఖిఖి అంటూ మొరపెట్టుకున్నారు. మహిళలందరూ ఉపసర్పంచ్ రెడ్డబోయిన కవిత ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటి నుండి బిందెలో నీళ్లు తెచ్చి వేప కొమ్మలు ఏర్పాటు చేసి జలకడవాలని బొడ్రాయి సమీపంలో కూడలి వద్ద ఒకే చోట ఏర్పాటు చేశారు. చుట్టూ తిరుగుతూ వానలు కురవాలని దేవుళ్ళు కరుణించాలని వేడుకుంటూ పాటలు పాడారు. వానలు కురిస్తే కలిగే లాభాలను వివరిస్తూ వరుణుడు కరుణించకపోతే కలిగే దుష్ప్రభావాలను వివరిస్తూ తమ పాటల ద్వారా ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ దేవతలకు బొడ్రాయికి జలాభిషేకం చేసి వానలు కురవాలని మొక్కులు మొక్కారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రెడ్డబోయిన కవిత, నీల కనకమ్మ , జన్నపల్లి కవిత, మాలి గీత, మల్లపురం కవిత, కథ శోభ, నీల కొండమ్మ, భీమనపల్లి అనిత, శివలక్ష్మి తదితరులు, కళ్యాణి ఉపేంద్ర, కనకమ్మ, లలిత, రెడ్డబోయిన పోషము, లలిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మాత్రల పంపిణీ సర్పంచ్ కోయ మధు చే శ్రీకారం



రాజాపేట జూలై 13 ప్రభాతవార్త: రాజపేట మండలంలో సోమవారం నిర్వహించిన నులిపురుగుల నిర్మూలన దినోత్సవము కార్యక్రమంలో భాగంగా మండలం లోని అన్నిఅంగన్వాడీ కేంద్రాలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఆల్బండజోలు మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంను స్థానిక సర్పంచ్ కోయ మధు గురుకుల పాఠశాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమం పురస్కరించుకొని వైద్యాధికారి డాక్టర్ మోసెస్ రాజ్, ఆరోగ్య విస్తరణ అధికారి భీకు నాయక్ పిల్లలకు హెల్త్ ఎడ్యుకేషన్ గురించి వివరించారు. వీరితో మాజీ సర్పంచి సోమసాని రాజ మల్లయ్యతో పాటు ప్రిన్సిపాల్ సుధాకర్, భాస్కర్ సూపెర్ వైసర్లు ప్రేమలత, విజయలక్ష్మి తదితరులు, హెల్త్ అసిస్టెంట్ ఉపేందర్, అనిత ఆశాలు పాల్గొన్నారు మండల వ్యాప్తంగా 5507 మంది పిల్లలకు గాను 5098 మంది పిల్లలకు దాదాపు 93 శాతం మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేశారు. మిగతా వారిని 20 వ తేదిన మాపు అప్ డెను పురస్కరించుకొని నూరు శాతం పూర్తి చేయనున్నట్లు డాక్టర్ మోసెస్ రాజ్ తెలిపారు.

# నులిపురుగులకు నివారణ మాత్రలు పంపిణీ



ఆలేరు, జూలై 13 (ప్రభాతవార్త): ఆలేరు పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంలో విద్యార్థినిలకు నులిపురుగుల వల్ల వ్యాధులు వ్యాపించకుండా నివారణ చర్యల్లో భాగంగా సోమవారం ఆలేరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ పాల్గొని విద్యార్థినిలకు మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థినిలు ఆరోగ్యకరమైన అలవాట్లు అలవరచుకుని, పరిశుభ్రమైన పరిసరాల్లో నివసిస్తూ, క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగించాలని సూచించారు. ప్రభుత్వం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించి తమ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జూకర్ సంపత్, మరియమ్మ మార్కు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, డాక్టర్ హైమావతి, ప్రభుత్వ నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుని జన్మదిన వేడుకలు



తుర్కపల్లి, జూలై 13 ప్రభాతవార్త: తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి చెన్న కిష్టయ్య జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో, గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్లె పహాడ్ మాజీ సర్పంచ్ సొక్కుల మోహన్ రెడ్డి గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడు పెండెం రవి, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు పెండెం జ్ఞానేశ్వర్, ఉపసర్పంచ్ పల్లె నరేష్ గౌడ్, పిఏసిఎస్ డైరెక్టర్ జాగిలాపురం సతీష్, నాయకులు పాంగల బాలకృష్ణ, మోహన్ బాబు దాసరి శ్రీశైలం ,జూపల్లి కనకరాజు ,దాసరి సధ్యుర్, నరసింహ, జితేందర్, పెండెం బలరాం, పెండెం రాములు, కళ్యాణం కృష్ణ,.పెండెం నరేందర్, పెండెం శంకర్, ప్రకాష్ నాయక్, పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ నులిపురుగుల దినోత్సవం

తుర్కపల్లి, జూలై 13 ప్రభాతవార్త: తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని పిహెచ్సి డాక్టర్ రుచిరా రెడ్డి ఆధ్వర్యంలో ఎంఈఓ మంజుషా రాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆల్బెండజోల్ వాడడం వల్ల కడుపులోని నులిపురుగులు అరికట్టబడి విద్యార్థుల్లో బుద్ధి మాధ్యం శారీరక ఎదుగుదల వంటి రుగ్మతల నుండి కాపాడబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాంపల్లి శ్రీనివాస్, సిహెచ్ఓ రాజయ్య ఎంపిహెచ్ఏ జానీ పాషా, సునీల్ కుమార్, ఎంపిహెచ్ఏ ఫిమేల్ సువాసిని పంచాయతీ కార్యదర్శి శైలజ, ఆశా వర్కర్లు వరలక్ష్మి తదితరులు, వరమ్మ పాల్గొన్నారు



# ప్రజావాణి అర్జీలపై జాప్యానికి తావివ్వొద్దు

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త:

ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీ వెనుక ఒక కుటుంబం సమస్య, ఒక పౌరుడి ఆవేదన ఉంటుందని, వాటి పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యానికి తావు లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి స్పష్టం చేశారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి వినతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, చట్టబద్ధంగా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. మొత్తం 113 అర్జీలు అందగా, ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు పంపిస్తూ, పరిష్కార ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు ఎన్నో ఆశలతో జిల్లా కేంద్రానికి వచ్చి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తున్నారని, అలాంటి ప్రతి వినతిని సానుకూల దృక్పథంతో పరిశీలించడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత అని అన్నారు. ఒకసారి అర్జీ స్వీకరించిన తర్వాత సంబంధిత శాఖలు దానిని పెండింగ్‌లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి వాస్తవ పరిస్థితులను తెలుసుకుని నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. పరిష్కారం సాధ్యం కాని అంశాలపై కూడా దరఖాస్తుదారులకు స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. భూ వివాదాలు, పట్టాదారు పాస్‌బుక్కు, ధరణి సమస్యలు, వారసత్వ మార్పులు, సర్వే, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సంక్షేమ పథకాల అమలు, పెన్షన్లు, మున్సిపల్ సేవలు, గ్రామీణ మౌలిక వసతులు, విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, తాగునీటి సమస్యలు తదితర అంశాలపై ప్రజలు అధిక సంఖ్యలో వినతులు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. శాఖల మధ్య సమన్వయంతో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.



ప్రజావాణిలో అందిన అర్జీల్లో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించినవి 56 ఉండగా, హౌసింగ్ శాఖకు 10, మున్సిపాలిటీకి 7, సర్వే అండ్ ల్యాండ్ శాఖకు 5, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు 4, సంక్షేమ శాఖకు 4, జిల్లా పరిషత్‌కు 4, కాలుష్య నియంత్రణ మండలికి 3, విద్యాశాఖకు 3, వైద్య ఆరోగ్య శాఖకు 3, వ్యవసాయ శాఖకు 2, ఉపాధి కల్పన శాఖకు 2, పంచాయతీరాజ్ శాఖకు 2 చొప్పున దరఖాస్తులు అందాయి. సమాచార శాఖ, ఇరిగేషన్, రవాణా, పశుసంవర్ధక, ఫుడ్ సేఫ్టీ, మత్స్యశాఖ, సహకార శాఖ, అటవీ శాఖలకు ఒక్కటి చొప్పున వినతులు వచ్చినట్లు వెల్లడించారు. ప్రజావాణి అర్జీల పరిష్కారంపై ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తామని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారులు వ్యక్తిగత బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ సేవల అసలు లక్ష్యమని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా సమర్థవంతమైన పాలన అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ కృతిక, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జెడ్పీ సీఈఓ శోభారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి ప్రతి ఒక్కరు పని చేయాలి

డీఐజీ జోయల్ డేవిస్



భువనగిరి రూరల్ జూలై 13 ప్రభాతవార్త

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్క పోలీస్ కట్టుబడి పనిచేయాలని, ప్రజల విశ్వాసాన్ని పెంపొందించేలా ప్రతి పోలీస్ పనిచేయాలని డి ఐ జి జోయల్ డేవిస్ ఆదేశాలు జారీ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు శాఖ పనితీరుపై సోమవారం డీఐజీ జోయల్ డేవిస్ సమగ్ర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అక్షాన్ష్ యాదవ్,అదనపు ఎస్పీలు లక్ష్మీనారాయణ, వినోద్ కుమార్ హాజరుకాగా డిఐజి మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి,నమోదవుతున్న నేరాలు, నేర నియంత్రణ, దర్యాప్తు పురోగతి, ప్రజా భద్రతకు సంబంధించిన అంశాలపై చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు.ప్రమాదాలకు గురయ్యే బ్లాక్‌స్పాట్ ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, జిల్లావ్యాప్తంగా సీసీటీవీ నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని,యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం భద్రతా ఏర్పాట్లు, నిఘా వ్యవస్థపై సమీక్షించి వీవీపీ పర్యటనలు, ముఖ్య కార్యక్రమాల బందోబస్తు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.భరోసా కేంద్రం పనితీరు, బాధితులకు అందుతున్న సేవలు,సైబర్ నేరాల నియంత్రణ, అవగాహన కార్యక్రమాలు, వేగవంతమైన దర్యాప్తు చేపట్టాలని,భద్రతా లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దే చర్యలు తీసుకోవాలని,ప్రధాన రహదారులపై అత్యాధునిక ఏఐ ఆధారిత కెమెరాల ఏర్పాటు, ట్రాఫిక్ నిర్వహణ, నేరాల గుర్తింపు, వాహనాల పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని,సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ స్మార్ట్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని,పెండింగ్ కేసులు త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి, శిక్షల శాతం పెంచే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసి ప్రజల్లో పోలీసులపై విశ్వాసాన్ని పెంపొందించేలా పనిచేయాలని సూచించారు. జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన, ప్రజా అనుకూల పోలీసింగ్ సేవలు అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లాలోని డీఎస్పీలు, సిఐలు, ఎస్ హెచ్ ఓ లు, ఎస్సైలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## వానాకాలం సాగుకు రైతు భరోసా నిధులు

**జిల్లాలో 2.40 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.314.41 కోట్లు**

యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త;

వానాకాలం2026 సాగు సీజన్‌కు రైతులకు పెట్టుబడి సాయంగా ప్రభుత్వం నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా నిధులను జమ చేస్తోంది. సోమవారం సాయంత్రం వరకు జిల్లాలో మొత్తం 2,40,152 మంది రైతుల ఖాతాల్లో రూ.314,41,62,225 జమైనట్లు అధికారిక గణాంకాలు వెల్లడించాయి. వ్యవసాయ శాఖ రూపొందించిన మండలాల వారీ నివేదిక ప్రకారం జిల్లాలోని 17 మండలాల్లో డీబీటీ పంపిణీ వేగంగా కొనసాగుతోంది. భూ రికార్డులు, ఆధార్, బ్యాంకు ఖాతాల అనుసంధానం పూర్తయిన రైతులకు నిధులు నేరుగా చేరుతుండగా, సాంకేతిక సమస్యలు, ఈకేవైసీ, భూ వివరాల సవరణలు పెండింగ్‌లో ఉన్న రైతులకు కూడా విడతల వారీగా జమ ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలో రైతుల సంఖ్య, సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉన్న మండలాల్లో డీబీటీ మొత్తం కూడా అధికంగా నమోదైంది. ముఖ్యంగా వలిగొండ మండలం జిల్లాలోనే అత్యధికంగా 24,183 మంది రైతులకు రూ.34.52 కోట్లు జమై మొదటి స్థానంలో నిలిచింది. నారాయణపూర్ మండలంలో 17,633 మంది రైతులకు రూ.21.52 కోట్లు, భువనగిరి మండలంలో 17,568 మంది రైతులకు రూ.22.74 కోట్లు, రామన్నపేట మండలంలో 17,073 మంది రైతులకు రూ.24.10 కోట్లు, చౌటుప్పల్ మండలంలో 14,959 మంది రైతులకు రూ.20.47 కోట్లు జమయ్యాయి. ఈ ఐదు మండలాలు జిల్లాలో డీబీటీ పంపిణీలో ముందంజలో ఉన్నాయి. ఆత్మకూర్(ఎం) మండలంలో 13,601 మంది రైతులకు రూ.19.86 కోట్లు, గుండాల మండలంలో 11,271 మందికి రూ.18.26 కోట్లు, మోత్కూర్ మండలంలో 10,883 మందికి రూ.15.16 కోట్లు, భూదాన్ పోచంపల్లి మండలంలో 14,046 మందికి రూ.18.51 కోట్లు, రాజాపేట మండలంలో 14,229 మందికి రూ.18.95 కోట్లు, మోటకొండూరు మండలంలో 11,079 మందికి రూ.16.98 కోట్లు, తుర్కపల్లి మండలంలో 14,548 మందికి రూ.14.25 కోట్లు, బొమ్మలరామారం మండలంలో 13,121 మందికి రూ.13.89 కోట్లు, యాదగిరిగుట్ట మండలంలో 10,764 మందికి రూ.13.52 కోట్లు, ఆలేరు మండలంలో 11,229 మందికి రూ.14.65 కోట్లు, అడ్డగూడూరు మండలంలో 10,435 మందికి రూ.14.66 కోట్లు, బీబీనగర్ మండలంలో 10,520 మందికి రూ.11.79 కోట్లు డీబీటీ కింద జమయ్యాయి. వ్యవసాయ పెట్టుబడి సాయం నేరుగా రైతుల ఖాతాల్లో జమ కావడంతో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కొనుగోలుకు రైతులకు ఊరట లభిస్తోంది. భూ రికార్డులు, ఆధార్‌బ్యాంకు అనుసంధానం పూర్తి కాని రైతుల వివరాలను అధికారులు పరిశీలిస్తూ, అర్హులైన ప్రతి రైతు ఖాతాలో కూడా నిధులు జమ అయ్యేలా చర్యలు చేపడుతున్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న రైతులు ఈకేవైసీ, బ్యాంకు ఖాతా, ఆధార్ లింకేజీ, భూ రికార్డుల వివరాలను సరిచేసుకుంటే తదుపరి విడతల్లో నిధులు జమ కానున్నాయి. జిల్లాలో మొత్తం 325 గ్రామాల పరిధిలో 2.91 లక్షలకుపైగా రైతులు నమోదు కాగా, ప్రస్తుతం 2.40 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.314.41 కోట్ల డీబీటీ విజయవంతంగా జమ కావడం వానాకాలం సాగుకు గణనీయమైన ఊతంగా నిలుస్తోందని అధికారులు పేర్కొంటున్నారు. మిగిలిన అర్హులైన రైతుల ఖాతాల్లో కూడా త్వరలోనే నిధులు జమ కానుండటంతో డీబీటీ లబ్ధిదారుల సంఖ్య, మొత్తం మరింత పెరిగే అవకాశముంది.

## 1.51 లక్షల మంది చిన్నారులకు ఆల్బెండాజోల్ లక్ష్యం

. తొలి రోజే 96 శాతం మందికి మాత్రల పంపిణీ

యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాత వార్త:

జిల్లాలో చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, నులిపురుగుల నిర్మూలన ద్వారా పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలను గణనీయంగా తగ్గించవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. ఎం. మనోహర్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం రాయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు నులిపురుగుల నివారణ కీలకమని పేర్కొన్నారు. పేగుల్లో నులిపురుగులు ఉండడం వల్ల పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, ఎదుగుదల మందగించడం, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాంటి పరిస్థితులను నివారించేందుకు ప్రభుత్వం ప్రతి ఏడాది జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తోందన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఈ ఏడాది మొత్తం 1,51,040 మంది అర్హులైన చిన్నారులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తొలి రోజే 96 శాతం మంది చిన్నారులకు మాత్రలు అందించడం జరిగిందని వెల్లడించారు. ఇంకా మాత్రలు తీసుకోని అర్హులైన చిన్నారులకు జులై 20న నిర్వహించే మాప్‌అప్ డే సందర్భంగా తప్పనిసరిగా ఆల్బెండాజోల్ మాత్రలు అందజేస్తామని చెప్పారు. జిల్లాలోని ప్రతి అర్హత కలిగిన చిన్నారికి మాత్రలు చేరేలా వైద్య, ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని డా. మనోహర్ ఆదేశించారు. పిల్లలు తప్పనిసరిగా మాత్రలు తీసుకునేలా తల్లిదండ్రులు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉప ప్రధాన విద్యాధికారి శ్రీ శ్రీనివాస్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. రామకృష్ణ, డా. సుమన్ కళ్యాణ్, ఉప జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి, భువనగిరి, జిల్లా కౌన్సిలర్ శ్రీమతి అరుణ, రాయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి అండలు, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

